ప్రజాశక్తి

మంగళవారం 23 ఏప్రిల్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

పది ఫలితాల్లో మెరుగు

◆ ఉత్తీర్ణతలో బాలికలదే పైచేయి

◆ విశాఖ జిల్లాలో 91.15 శాతం, అనకాపల్లి జిల్లాలో 89.04 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, ఆరిలోవ విలేకరి

సోమవారం విడుదలైన పది ఫలితాల్లో రాష్ట్రంలో విశాఖపట్నం జిల్లాకు 8, అనకాపల్లి జిల్లాకు 12వ స్థానం దక్కింది. రెండు జిల్లాల్లోనూ ఉత్తీర్ణతలో బాలురు కంటే బాలికలే పైచేయి సాధించారు. విశాఖపట్నం జిల్లాలో 28,299 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వీరిలో బాలురు 14,932 మంది, బాలికలు 13,367 మంది వున్నారు. ఉత్తీర్ణులైన 25,794 (91.15 శాతం) మందిలో బాలురు 13,449 (90.07 శాతం) మంది, బాలికలు 12,345 (92.35 శాతం) మంది వున్నారు. ఉత్తీర్ణతా శాతం 2023లో వచ్చిన 82.68 శాతం నుంచి 2024 ఫలితాల నాటికి 91.15 శాతానికి పెరిగింది. విశాఖ జిల్లాలో ఉత్తీర్ణులైన 25,794 మంది విద్యార్థుల్లో ప్రథమ శ్రేణిలో 21,998 మంది, ద్వితీయ శ్రేణిలో 2,620 మంది, తృతీయ శ్రేణిలో 1176 మంది వున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన ఆరిలోవ శ్రీకృష్ణ గ్రామర్ స్కూల్ విద్యార్థులు

అనకాపల్లి జిల్లాలో పది పరీక్షలు రాసిన 21,169 మందిలో బాలురు 10,820 మంది, బాలికలు 10,349 మంది వున్నారు. వీరిలో ఉత్తీర్ణులైన 18,848 మంది విద్యార్థుల్లో బాలురు 9,384 (86.73 శాతం) మంది, బాలికలు 9,464 (91.44 శాతం) మంది ఉన్నారు. జిల్లాలో ఉత్తీర్ణులైన 18,848 మంది విద్యార్థుల్లో ప్రథమ శ్రేణిలో 14,725 మంది, ద్వితీయ శ్రేణిలో 2,867 మంది, తృతీయ శ్రేణిలో 1256 మంది వున్నారు. 2023లో 77.74 శాతం ఫలితం రాగా, ఈ ఏడాది 89.04 శాతానికి పెరిగింది.

స్టీల్‌ప్లాంట్ అమ్మకంపై

జగన్ నోరు మెదపకపోవడం దారుణం

◆ బిజెపితో లాలూచీ బట్టబయలు

◆ సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్టీల్‌ప్లాంట్ అమ్మకంపై సిఎం జగన్ మోహన్ రెడ్డి నోరు మెదపకపోవడం దారుణమని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి, ఆ పార్టీ గాజువాక నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బిజెపితో జగన్ మోహన్ రెడ్డి లాలూచీ మరొకసారి బట్టబయలైందని తెలిపారు. సిఎం జగన్ రెండు రోజులు విశాఖలో ఉండి ఉక్కు కర్మాగారంపై కనీసం పెదవి విప్పలేదన్నారు.

అమ్మకం నుండి ప్లాంట్‌ను కాపాడతామన్న మాట కూడా అనలేదన్నారు. ఈ అవకాశవాద వైఖరిని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. రెండేళ్ల నుంచి ప్లాంట్‌ని బిజెపి అష్టదిగ్బంధనం చేస్తోందని తెలిపారు. ఉత్పత్తికి సగానికి సగంకోత పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు అదానీని స్టీల్‌ప్లాంట్‌పై ఉపయోగిస్తోందని తెలిపారు. పోర్టు కార్మికుల సమ్మె పరిష్కారం చేయకుండా ప్లాంట్‌కి బొగ్గు సరఫరాను నిలుపుదల చేసి ప్లాంట్‌ను మరింత సంక్షోభంలోకి నెట్టిందన్నారు. ఇప్పుడు ప్లాంట్‌ను ఏకంగా మూసివేయాలనే కుట్రలకు తెగబడిందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్లాంట్ రక్షణకు అండగా ఉంటానని, బిజెపికి వ్యతిరేకంగా పోరాడుతానని మాట్లాడక పోవడం జగన్ మోహన్ రెడ్డి ద్రోహం తేటతెల్లమవుతోందని పేర్కొన్నారు. తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు కూడా మొన్న గాజువాకలో ఎన్నికల సభ పెట్టి మోడీ జపం చేశారన్నారు. స్టీల్‌ప్లాంట్‌పై దిగజారి మాట్లాడారని తెలిపారు.

ఈ పార్టీలు స్టీల్‌ప్లాంట్‌ను కాపాడటం కన్నా బిజెపితో అవకాశవాద రాజకీయంతో ప్లాంట్ అమ్మకానికి లేదా మూసివేతకు మద్దతు ఇస్తున్నాయనేది స్పష్టమవుతోందన్నారు. ఈ నేపథ్యంలో బిజెపితో జతకట్టి లొంగిపోయి రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తున్న ఆ పార్టీలను ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని, ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు జగ్గునాయుడు విజ్ఞప్తి చేశారు. తద్వారా మాత్రమే విశాఖ స్టీల్‌ప్లాంట్ మోడీ చెర నుండి రక్షించబడుతుందని తెలిపారు.

విశాఖలోనే సిఎం జగన్ బస

▸ వార్త మెయిన్‌లో..

ఎవికెలో 1 నుంచి గ్రూప్-2 మెయిన్స్ కోచింగ్

▸ వార్త 2లో..

ఎల్‌అండ్‌టి ఎడ్యుటెక్‌తో 'బుల్లయ్య' ఎంఒయు

▸ వార్త 3లో..

లొంగిపోయిన మావోయిస్టులతో పోలీసాధికారులు విశాల్‌గున్ని, తుహిన్‌సిన్హా

ఆరుగురు మావోయిస్టులు లొంగుబాటు

కీలక విషయాలు వెల్లడించిన పోలీసాధికారులు

వార్త మెయిన్‌లో..

జోరుగా నామినేషన్లు

విశాఖ, అనకాపల్లిల్లో పోటాపోటీగా ప్రధాన పార్టీల అభ్యర్థుల ర్యాలీలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ, అనకాపల్లి విలేకరులు

విశాఖ, అనకాపల్లిల్లో సోమవారం నామినేషన్లు ఊపందుకున్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటాపోటీగా ర్యాలీలు నిర్వహించి బలప్రదర్శనకు దిగారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా విశాఖపట్నం పార్లమెంటు స్థానానికి ఐదో రోజు సోమవారం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. అభ్యర్థుల నుంచి జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున నామపత్రాలు స్వీకరించారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి నుంచి ఎంపీ స్థానానికిగాను ఉమ్మడి అభ్యర్థులుగా మతుకుమిల్లి శ్రీభరత్, మతుకుమిల్లి తేజశ్విని ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారికి అందించారు. విశాఖ ఎంపీ అభ్యర్థులుగా వైసిపి నుంచి బొత్స ఝాన్సీలక్ష్మి మూడు సెట్లు, బొత్స అనూష ఒక సెట్ నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. అలాగే సమాజ్ వాదీ పార్టీ నుంచి జాలాది విజయ కుమారి సోమవారం మరొకసారి రెండో సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించారు. ముందుగా ఆయా అభ్యర్థుల పత్రాలను జిల్లా రెవెన్యూ అధికారి, ఏఆర్వో కె.మోహన్ కుమార్ పరిశీలించి సహకారం అందించారు. మరోపక్క ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సోమవారం 22 నామినేషన్లు దాఖలయ్యాయి. అనకాపల్లి పార్లమెంటు స్థానానికి సోమవారం ఐదు నామినేషన్లు దాఖలు కాగా మిగతా 2లో..

నామినేషన్ వేస్తున్న వైసిపి ఎంపీ అభ్యర్థి ఝాన్సీ

నామినేషన్ వేస్తున్న టిడిపి ఎంపీ అభ్యర్థి శ్రీభరత్

మొదటి పేజీ తరువాయి..

జోరుగా నామినేషన్లు

అసెంబ్లీ స్థానాలకు 12 నామినేషన్లు దాఖలు అయ్యాయి. పార్లమెంటు స్థానానికి వైసిపి అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు మూడు సెట్ల నామినేషన్లు, బిఎస్‌పి నుంచి పలక శ్రీరామ్ మూర్తి, స్వతంత్ర అభ్యర్థులుగా షేక్ షఫీ ఉల్లా, సిద్ధ లోవరాజు, వంకాయల రామచంద్రరావు ఒక్కో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. అలాగే అసెంబ్లీ స్థానాలకు చోడవరం నుంచి వైసిపి అభ్యర్థి కరణం ధర్మశ్రీ రెండు సెట్లు, మాడుగుల అసెంబ్లీ స్థానానికి వైసిపి నుంచి ఈర్లే అనురాధ, బూడి రమణమ్మ, తెలుగుదేశం నుంచి బొడ్డు సత్యనారాయణమూర్తి, కాంగ్రెస్ పార్టీ నుంచి బొడ్డు బుచ్చి సత్య శ్రీనివాస్, బిఎస్‌పి నుంచి కరణం తిరుపతిరావు నామినేషన్లు వేశారు. అనకాపల్లి అసెంబ్లీ స్థానానికి సమాజ్‌వాది పార్టీ తరపున ఒమ్మి వెంకట యాదవ్, యలమంచిలి అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థి ఎరిపల్లి కాసులు, పాయకరావుపేట అసెంబ్లీ స్థానానికి వైసిపి నుంచి కంబాల జోగులు మూడు సెట్ల నామినేషన్లు, జై భారత్ నేషనల్ పార్టీ తరపున దొర్లపాటి నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ తరపున వంగలపూడి అనిత నామినేషన్లు వేయగా, నర్సీపట్నం అసెంబ్లీ స్థానానికి టిడిపి తరపున చింతకాయల రాజేష్ రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు.

పోటాపోటీగా బొత్స ఝాన్సీ, శ్రీ భరత్ నామినేషన్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : విశాఖ పార్లమెంటు స్థానానికి వైసిపి అభ్యర్థిగా, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ, టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థిగా ఎం.శ్రీ భరత్ సోమవారం నగరంలో భారీ స్థాయిలో ర్యాలీలు నిర్వహించి, కలెక్టరేట్‌కు వచ్చి, జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఝాన్సీ కుమార్తె బొత్స అనూష డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అలాగే శ్రీ భరత్ సతీమణి తేజస్విని నామినేషన్ వేశారు. నామినేషన్లు దాఖలు చేయడానికి ముందుగా కూటమి అభ్యర్థి ఎం.శ్రీభరత్ ఎంవిపి.కాలనీలోని తన ఎన్నికల కార్యాలయం నుంచి వేలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. మద్దిలపాలెం, గురుద్వారా, ఆర్‌టిసి కాంప్లెక్స్, డాబా గార్డెన్స్, మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ సాగింది. ర్యాలీలో శ్రీ భరత్‌తో పాటు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు, పి.గణబాబు, పార్టీ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి, దక్షిణ కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్, ఉత్తర కూటమి అభ్యర్థి పి.విష్ణుకుమార్ రాజు, మాజీ ఎమ్మెల్సీ పివి.ఎన్ మాధవ్, ఎస్.కోట అభ్యర్థి కోళ్ల లలిత కుమారి, ఎమ్మెల్సీలు వేపాడ చిరంజీవిరావు, దువ్వారపు రామారావు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి అభ్యర్థి బొత్స ఝాన్సీ బీచ్ రోడ్డులోని తన ఎన్నికల కార్యాలయం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు వేలాది మందితో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాజ్యసభ సభ్యుడు, వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్చార్జ్ వైవి.సుబ్బారెడ్డి, రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గాజువాక, విశాఖ దక్షిణ, ఎస్.కోట ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్ కుమార్, కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, వైసిపి ఉత్తర నియోజవర్గం అభ్యర్థి కెకె.రాజు, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకటరామయ్య, తిప్పల గురుమూర్తి రెడ్డి, మళ్ల విజయప్రసాద్, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, వైసిపి ఉత్తరాంధ్ర యువజన విభాగం జోనల్ ఇంఛార్జ్ అవనాపు విక్రమ్, విజయనగరం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డిసిఎంఎస్) ఛైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన పాల్గొన్నారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 1 నుంచి

గ్రూప్-2 మెయిన్స్ కోచింగ్ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం అధ్వర్యంలో గ్రూపు-2 మెయిన్స్ కోచింగ్ మే 1వ తేదీ నుంచి ప్రారంభం కానుందని ఎవికె స్టడీ సర్కిల్ నిర్వాహకులు డాక్టర్ జి.ప్రియాంక తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పోటీ పరీక్షల శిక్షణ సామాన్యులకు అందుబాటులో ఉంచే ఉద్దేశ్యంతో నడుస్తున్న ఈ సెంటర్ మంచి ఫలితాలు సాధిస్తోందని పేర్కొన్నారు. గ్రూపు-2 మెయిన్స్ కోచింగ్ కోసం ఆసక్తిగల అభ్యర్థులు 8374537181, 8886578595 నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ శిక్షణ రెండు నెలల పాటు ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు ఉంటుందని, గ్రూపు చర్చలు, మోడల్ పరీక్షలు ఉంటాయని తెలిపారు. అనుభవిజ్ఞులైన బోధకులచే పాఠాలు బోధించబడతాయని తెలిపారు.

ప్రిలిమ్స్‌లో ప్రతిభ కనబరిచిన వారికి అభినందనలు

అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నడుస్తున్న గ్రూపు - 2 స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన వారు ఇటీవలే వచ్చిన ప్రిలిమ్స్ ఫలితాల్లో 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. వారందరికీ విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు వివిఎస్.పద్మనాభరాజు, డాక్టర్ బి.గంగారావు అభినందనలు తెలిపారు.

డాక్టర్ అవినాష్‌కు ఘనసత్కారం

ప్రజాశక్తి- వేపగుంట : కృష్ణానగర్‌లోని ఇండో హ్యూమన్ రైట్స్ కేర్ ప్రధాన కార్యాలయంలో నిమ్స్ పూర్వ న్యూరాలజిస్ట్, కెజిహెచ్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ అవినాష్‌ను సమాజ సేవారత్న పురస్కారంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జై అవినాష్ మాట్లాడుతూ ఐహెచ్‌ఆర్‌సి పురోభివృద్ధికి, వైద్యశిబిరాల్లో ఉచితంగా సేవలను తనవంతుగా అందిస్తానన్నారు. సంస్థ జాతీయ చైర్మన్ రాజాన ప్రసాదరావు, జనరల్ సెక్రెటరీ పిఐఎస్ రాజు, సలహాదారు మధు జయరాజ్, స్పోర్ట్స్ అడ్వైజర్ పి మురళి, స్టేట్ ప్రెసిడెంట్ వై శ్రీనివాస్, విశాఖపట్నం జిల్లా వైస్ ప్రెసిడెంట్ బి రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

రూ.2.24 లక్షల కోట్ల ఎగుమతులతో..

విశాఖ సెజ్ గణనీయ ప్రగతి

వివరాలు వెల్లడిస్తున్న ముప్పాల శ్రీనివాస్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : 2023-2024 ఆర్థిక సంవత్సరంలో విశాఖ స్పెషల్ ఎకనమిక్ జోన్ (విఎస్ఇజెడ్) రూ.2లక్షల 24వేల 631కోట్ల ఎగుమతులను చేసి గణనీయ ప్రగతి సాధించిందని జోనల్ డెవలప్‌మెంట్ కమీషనర్ (ఐఆర్ఎస్ఇ, విశాఖపట్నం) ముప్పాల శ్రీనివాస్ సోమవారం వెల్లడించారు. 2022-2023తో పోలిస్తే ఈ సమయానికి 23శాతం పెరుగుదల ఉందన్నారు. వీటిలో సేవల ఎగుమతులు రూ.1,54,707కోట్లు, సరకుల ఎగుమతులు రూ.69,924కోట్లు ఉందన్నారు. సేవల ఎగుమతుల్లో 18శాతం, సరకుల ఎగుమతుల్లో 43శాతం వృద్ధి సాధించినట్లు తెలిపారు. ఈ ఏడాది కాలంలో ఎపిలో 9, తెలంగాణలో 22 మొత్తంగా 31 కొత్త సెజ్ యూనిట్ ప్రతిపాదనలు ఆమోదించబడ్డాయన్నారు.

విఎస్ఇజెడ్ పెట్టుబడుల ఆకర్షణ

రూ.1.10లక్షల కోట్లు

2023 డిసెంబరు 31 నాటికి రూ.1,10,094కోట్ల పెట్టుబడులను విఎస్ఇజెడ్ ఆకర్షించిందని, 6.10లక్షల మందికి ఉపాధి కల్పించిందన్నారు. 4వ త్రైమాసికం (జనవరి-మార్చి 2024) తెలంగాణ రాష్ట్రంలో 4 కొత్త సెజ్ యూనిట్ ప్రతిపాదనలు, ఏపిలో ఒక కొత్త సెజ్ యూనిట్ ప్రతిపాదనలకు ఆమోదం లభించిందన్నారు. కొత్తగా ఆమోదించబడిన సెజ్ యూనిట్లు రూ.686.50కోట్ల పెట్టుబడులను పెట్టి 9587 మందికి ఉపాధి కల్పిస్తాయని శ్రీనివాస్ ముప్పాల తెలిపారు.

ఏఏ పరిశ్రమలు ఎక్కడెక్కడ?

ఆంధ్రప్రదేశ్‌లో డైమండ్ కటింగ్ పాలిషింగ్, అలాగే బంగారు ఆభరణాల (ప్లేయిన్ / స్టడెడ్) తయారీ కోసం విశాఖపట్నంలోని ఎం/ఎస్‌పిఎస్‌కెఎస్ గోల్డెన్ జెమ్ హౌస్ ప్రైవేట్ లిమిటెడ్ స్పెషల్ ఎకనామిక్‌కు కొత్త సెజ్ యూనిట్ ప్రతిపాదనలు ఆమోదించబడ్డాయన్నారు. తెలంగాణలో నాలుగు కొత్త సెజ్ యూనిట్‌లకు ఆమోదం లభించగా, కుమారి ఎవర్‌టాప్ టెక్స్‌టైల్ అండ్ అప్పారెల్ కాంప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫర్ టెక్స్‌టైల్స్ ఒకటి ఉందన్నారు. గ్లోబల్ లాజిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, టైలర్డ్ మేనేజ్‌మెంట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, కుమారి ఫోర్సిస్ సాఫ్ట్‌వేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఐటి/ఐటిఇఎస్ కోసం ఏర్పాటుకు ప్రతిపాదనలు ఆమోదించబడ్డాయని పేర్కొన్నారు.

టెన్త్‌లో వన్ వరల్డ్ స్కూల్ విజయఢంకా

ఉషశ్రీ

కుషల్

గులాల్షి

జగదీష్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్థానిక పెదవాల్తేర్ లాసన్స్ బే కాలనీలోని వన్ వరల్డ్ స్కూల్ 2024 సంవత్సర పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో మరోసారి విజయ దుందుబి మోగించింది. 600 మార్కులకుగాను ఉషశ్రీ 589, కుషల్ 589, గులాల్షి 587, జగదీష్ 583 సాధించారు. మొత్తం 43 మంది విద్యార్థులకు 90 శాతంపైన వచ్చిన వారు 15 మంది ఉండగా, 80-90 శాతం మధ్య మరో 15 మంది మార్కులు సాధించారు. వీరంతా స్థానిక పెదవాల్తేర్, జాలారిపేట వంటి మధ్య తరగతి కాలనీల నుంచి వచ్చి అద్భుత విజయాలను అందుకుంటున్నవారే . గత 25 సంవత్సరాలుగా ఇదే ప్రాంతంలో సేవాదృక్పథంతో తక్కువ ఫీజులతో వన్ వరల్డ్ స్కూల్ సామాన్యులకు సేవలందిస్తూ, ప్రతి సంవత్సరం ఉన్నత ఫలితాలతో ప్రశంసలందుకుంటోంది. ప్రఖ్యాత జవహర్‌లాల్ నెహ్రూ యునివర్సిటీ న్యూఢిల్లీలో ఉన్నత విద్యనభ్యసించిన కర్రి సూర్యనారాయణ రెడ్డి ఈ పాఠశాలను స్థాపించి నిర్వహిస్తుండగా, ఆదిలక్ష్మి సమన్వయకర్తగా, మెహజాబీస్ హెడ్ మిస్ట్రెస్‌గా వ్యవహరిస్తున్నారు.

జివిఎంసి స్కూల్లో చదివి ప్రతిభ చాటిన భవాని

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ స్కూల్‌లో చదివి పదో తరగతిలో 571 మార్కులు సాధించి ప్రతిభ చాటుకున్న విద్యార్థిని అనకాపల్లి భవాని. కంచరపాలెం మెట్టు రామ్మూర్తి పంతులుపేట జివిఎంసి హైస్కూలులో చదువుకుంటున్న అనకాపల్లి భవాని పదో తరగతిలో 600 మార్కులకుగాను 571 మార్కులు సాధించి స్కూలులో ప్రథమ స్థానం పొందిందని స్కూలు హెడ్మాస్టర్ రాపర్తి శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు. భవాని ఎనిమిదో తరగతి వరకు మేఘాద్రి గెడ్డలోని ఒక ప్రైవేటు స్కూల్లో చదివింది. ఆ స్కూల్లో ఫీజులు చెల్లించలేక, తల్లిదండ్రులు వెంకటి, చిన్నాలు భవానీని జివిఎంసి హైస్కూల్లో 9వ తరగతిలో చేర్పించారు. ప్రభుత్వం ఇస్తున్న అమ్మ ఒడి పథకం ద్వారా

భవాని

అందిన ఆర్థిక సాయంతో తాను చదువుకోగలిగానని భవాని తెలిపారు.

ఇంటర్‌లో బైపిసి తీసుకొని డాక్టర్ కావాలనేది తన లక్ష్యం అని తెలిపింది. భవానిని స్కూల్ హెడ్మాస్టర్ శ్రీనివాసరావు అభినందించారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
E.P.231/2023 in O.S.178/2023

Between:
G. Kumari Sridevi … D.Hr/Plaintiff
And:
Bugatha Anitha … J.Dr/Defendant

Notice under Order 21 Rule 54 of CPC

To,
J.Dr: Bugatha Anitha,
W/o. Kishore, Hindu,
aged about 59 years,
R/at D.No.4-40, Sundhar Nagar,
Near Old Dairy Farm,
Visakhapatnam.

Whereas you have failed to satisfy a decree passed against you on the 24th August 2023, Suit No.178/2023 in favour of G. Kumari Sridevi for Rs. 27,02,500/-. It is ordered that you the said J.Dr he and you are hereby prohibited and restrain until the further order of the Court from transferring or Charging the property specified in the scheduled here under annexed by sale gift or otherwise and that a persons and that they are hereby prohibited from receiving the same day purchase, gift or otherwise. It is also ordered that you should attend Court on the **03-05-2024** at **10:30 A.M.** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence.

K. MADHUSUDHANA RAO,
Advocate
Visakhapatnam,
Cell: 9989012912.

IN THE HON'BLE COURT OF THE XII ADDL. DISTRICT AND SESSIONS JUDGE AT: VISAKHAPATNAM
O.S.22/2021

Between:
Eddipilli Lalitha & others …Plaintiffs
And:
Chowdari (Eddipilli) Chinnammadu & 27others …Defendants

SUMMONS

To,
D-16:Sri Nimmagedda Vijay Kumar
S/o. Venkata Narayana,Hindu,
aged about 72 years,
R/at D.No. 55-6-5/8,
Seshadri Enclave,
Old Venkojipalem,
Visakhapatnam District.

Please take notice that the above-named plaintiffs has instituted the above suit against you and the matter stands posted to **26-04-2024** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **26-04-2024** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the suit will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
R. PARAMESWARA RAO
Advocate,Visakhapatnam.

IN THE HON'BLE COURT OF THE XIII ADDL. DISTRICT JUDGE AT: GAJUWAKA
E.P.126/2018 in A.A.134/2012

Between:
M/s. Shriram City Union Finance Ltd.,Gajuwaka Branch,
Rep. by its Sr. office Assistant
K. Jagadeeswara Rao …D.Hr
And:
Sri V. Chakravarthy & Another …J.Drs

NOTICE

To,
J.Dr No.1:
Sri Vakapalli Chakravarthy,
S/o. Venkata Subba Rao,
Hindu, aged about 35 years,
R/at Q. No. 6-34-8, Drivers Colony,
L.B.S. Nagar, Gajuwaka,
Visakhapatnam.

Take notice that the above named D.Hr has filed the above E.P. U/O XXI Rule 54 of CPC against you for a sum of Rs.15,55,722/- with interest and costs. You are hereby summoned to appear in the above court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the above EP on **30-04-2024** at **10.30 A.M.** In default of your appearance on that day the petition will be heard and determined in your absence.

(By Order of the Hon'ble Court)
K.S.N. MURTHY,
Advocate
Gajuwaka, Visakhapatnam,
Cell: 9848444288.

IN THE HON'BLE COURT OF THE XIII ADDL. DISTRICT JUDGE AT: GAJUWAKA
E.P.107/2019 in A.C.416/2017

Between:
M/s. Shriram City Union Finance Ltd., Visakhapatnam,
Rep. by its G.M. cum GPA Holder
Kurakula Vasu …D.Hr
And:
M/s. Sai Sadguru Finance Corporation, Rep. by its Managing Partner
Sri Goluguri Sarreddy & 2 others …J.Drs

NOTICE

To,
J.Dr No.2:
Smt. Goluguri Venkata Lakshmi,
W/o. G. Sarreddy, Hindu,
aged about 48 years,
R/at D.No. 29-5-2,
Gollapalem, Dabagardens,
Near Women's College Down,
Visakhapatnam.

Take notice that the above named D.Hr has filed the above E.P. U/O XXI Rule 54 of CPC against you for a sum of Rs.32,93,788/- with interest and costs. You are hereby summoned to appear in the above court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the above EP on **30-04-2024** at **10.30 A.M.** In default of your appearance on that day the petition will be heard and determined in your absence.

(By Order of the Hon'ble Court)
K. SRINIVASA RAO, Advocate
Visakhapatnam

'పది' ఫలితాల్లో పలువురి సత్తా

గాజువాక విజ్ఞాన్ స్కూల్‌లోవిద్యార్థులతో ప్రిన్సిపల్ పర్వీన్

ప్రజాశక్తి- గాజువాక : జోగవానిపాలెం విజ్ఞాన్ హైస్కూల్‌లో టెన్త్ ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణతతో సత్తా చాటారు.51 మంది విద్యార్థులకు గాను 25మంది 500 పైబడి మార్కులు సాధించగా, 400 మార్కులు పైబడి 45మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపల్ పర్వీన్ తెలిపారు. విద్యార్థులను అభినందించారు. సాధించిన వారు 20 మంది, సాధించే రు. మిగిలిన విద్యార్థులు కూడా ఉత్తీర్ణత సాధించేరు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ పర్వీన్ విద్యార్థులను అభినందించారు.

టి.రోషిత

విశాఖపట్నం : కంచరపాలెం హైవేను ఆనుకుని ఉన్న గిరీష్ శ్రీచైతన్య పబ్లిక్ స్కూల్లో టెన్త్ ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాల విద్యార్థిని టి. రోషిత 591/600 మార్కులతో సత్తాచాటారు. ఆమెను స్కూల్ డైరెక్టర్ సోమశేఖర్, హెచ్ఎం అనురాధ అభినందించి, రూ.పదివేల నగదు బహుమతిని విద్యార్థిని తల్లిదండ్రులకు అందజేశారు.

సహిత

మధురవాడ : టెన్త్ ఫలితాల్లో సునీల్‌శర్మ వాంబే కాలనీ ప్రభుత్వ పాఠశాలలో 89 శాతం ఉత్తీర్ణత సాధించనట్లు హెచ్ఎం గీతాదేవి తెలిపారు. నలుగురు విద్యార్థులకు 300పైబడి మార్కులు వచ్చాయి. ఎండాడ ప్రభుత్వ పాఠశాలలో 66 శాతం, మారికవలస గిరిజన గురుకుల ఇంగ్లీష్‌మీడియం స్కూల్‌లో 80 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ శివప్రసాద్ తెలిపారు.

రత్నం సోనియా

ఆరిలోవ : శ్రీకృష్ణాపురం అంబేద్కర్ గురుకులంలో 65 మంది విద్యార్థులకుగాను 63 మంది ఉత్తీర్ణులై 95.38 శాతంఉత్తీర్ణత సాధించారు. 43 మంది ఫస్ట్‌క్లాస్‌లోను, 10 మంది సెకండ్ క్లాస్‌లో పాసయ్యారు. వై.జయవర్ధన్ (529) కె.కిరణ్ (503) కె.రాజ్‌కుమార్, జి.విజ్ఞాన్(498) మార్కులతో టాపర్స్‌గా నిలిచారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ వి.రత్నవల్లి అభినందించారు.

తోటగరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 424 మందికి గాను 286మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 67.4 శాతం ఫలితాలు సాధించారు. రత్నం సోనియా (584), రామచరణ్ (578) టాపర్స్‌గా నిలిచారు.

శ్రీకృష్ణ గ్రామర్ స్కూలు విద్యార్థుల ప్రభంజనం

10వ వార్డు, ఆదర్శనగర్‌లోని శ్రీకృష్ణ గ్రామర్ స్కూలు విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణతతో విజయభేరి మోగించారు. ఎన్.నారాయణ నిఖిలేష్ (593)టాపర్‌గా నిలవగా, ప్రీతి మహంతి(592), బి.గీతిక (590), ఎం.మేఘనశ్రీ(589), ఎం.వెంకటేష్ (588) తర్వాత స్థానాల్లో నిలిచారు. 590పైబడి ముగ్గురు, 580పైబడి 13 మంది, 570పైబడి 21 మంది, 550 మార్కులు పైబడి 46 మంది విద్యార్థులు సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను స్కూలు డైరెక్టర్లు మునికృష్ణ, విజయ్ తల్లిదండ్రులు అభినందించారు.

జయవర్ధన్

విశాఖపట్నం : ఎయు ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 66 మంది టెన్త్ విద్యార్థుల్లో 65 మంది ఉత్తీర్ణులయ్యారు. 584మార్కులతో ద్రాక్షాయణి టాపర్‌గా నిలవగా, 21మంది విద్యార్థులకు 500పైబడి మార్కులు వచ్చాయి. ఎయు తెలుగు మాధ్యమం పాఠశాలలో 52 మందికి గాను 40 మంది ఉత్తీర్ణులై 77 శాతం ఫలితాలు సాధించారు.ప్రతిభ చూపిన విద్యార్థులను ఎయు విసి ఆచార్య ప్రసాదరెడ్డి అభినందించారు.

నెమిష

భీమునిపట్నం : మండలం, జివిఎంసి పరిధిలోని 22 జెడ్పి, జివిఎంసి ఉన్నత పాఠశాలల్లో టెన్త్ పరీక్షల్లో 82 శాతం ఉత్తీర్ణత సాధించారు.ఇంగ్లీష్ మీడియంలో 642 మంది పరీక్షకు హాజరవ్వగా,581 మంది (90 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇఒ ఎం శివరాణి తెలిపారు. ఎపి గురుకుల పాఠశాల విద్యార్థిని బంగారు నైనిష 588 మార్కులు, లావేటి దుర్గ 586 మార్కులతో సత్తా చాటారు భీమిలి మండలం లక్ష్మీ పురానికి చెందిన ఎం రాహుల్ 584 మార్కులతో మూడో స్థానంలో నిలిచాడు

ఎల్. దుర్గ

తెలుగు మీడియంలో 563 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వగా, 408 మంది(72.5శాతం) ఉత్తీర్ణత సాధించారు. మజ్జివలస జెడ్‌పి హైస్కూల్ విద్యార్థిని ఆర్ ప్రమీల 570, కె స్వాతి 563, ఎ.రాజేష్ 562 మార్కులు సాధించారు

.మండలం మొత్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 1205 మంది పరీక్షలు రాయగా, 989 మంది (82శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇంగ్లీష్ మీడియంలో 34 మంది, తెలుగు మీడియంలో 22 మంది 500 కంటే ఎక్కువ మార్కులు సాధించారు.

తగరపువలస : చిట్టివలస జెడ్‌పి హైస్కూల లో 112 మంది విద్యార్థులకు గాను 99 మంది టెన్త్ లో ఉత్తీర్ణత సాధించారు. స్థానిక కొత్తపేటకు చెందిన గిడుతూరి భవానీ ప్రసాద్ 583మార్కులతో టాపర్‌గా నిలవగా, ప్రేమ్‌కుమార్ సాహు 575 మార్కులు సాధించాడు. 500పైబడి మార్కులతో 20 మంది ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్ఎంపొట్నూరు మురళీ మోహన్ రావు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు

భవానీ ప్రసాద్

ఆనందపురం :పదో తరగతి ఫలితాల్లో మండలంలోని 95శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఇఒ ఎస్ఎస్ పద్మావతి తెలిపారు. గిడిజాల పాఠశాల విద్యార్థి 570 మార్కులు, గొట్టిపల్లి హైస్కూల్ విద్యార్థి 568 మార్కులు, న్యూ లైఫ్ స్కూల్ విద్యార్థి 564 మార్కులు, ఆనందపురం హైస్కూల్ విద్యార్థి 561 మార్కులతో సత్తాచాటారు. న్యూలైఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరెస్పాండెంట్ శ్యామ్ మాథ్యూస్ తెలిపారు. పద్మావతి 564, డి రక్షిత.538, సిహెచ్ ధరణి 537, డి మమత శ్రీ 517, ఎస్ హేమంత్ 514, జి జస్వంత్ 489, పి ఆనంద్ 473, కె దీపిక 473, టి మోహన్ రావు 413, డి కార్తీక్ 348/500, మార్కులు సాధించారని తెలిపారు.

పద్మనాభం : టెన్త్ ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వపాఠశాలలు విద్యార్థులు 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. 609 మంది విద్యార్థులకుగాను 595 మంది ఉత్తీర్ణత సాధించారు. రెడ్డిపల్లి, బి ఆర్ తాళ్లవలస, రేవిడి కెజిబివి, పాండ్రంగి పాఠశాలల్లో శతశాతం ఉత్తీర్ణత నమోదైంది. పద్మనాభం గోస్తనీ స్కూల్, కృష్ణాపురం స్ప్రింగ్‌ఫీల్డ్ స్కూల్, రెడ్డిపల్లి జ్ఞానజ్యోతి స్కూల్, . ఐనాడ పంచాయతీ సత్యనారాయణపురం వాణీ సంతోష్ స్కూల్‌లో టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించారు.

పెందుర్తి : టెన్త్ ఫలితాల్లో సరిపల్లి భాష్యం విద్యార్థులు మార్కుల సునామీ సృష్టించారు. 154 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, శతశాతం ఉత్తీర్ణత సాధించారు. కె.శ్యామ్ రామ్‌చరణ్ 590/600 మార్కులతో సత్తా చాటాడు. నాయుడుతోట రవినగర్ భాష్యం పాఠశాలలో 108మంది ఉత్తీర్ణులై వందశాతం ఫలితాలు సాధించారు.ఇ.రోషిణి588/600మార్కులతో ప్రతిభ చూపింది. ప్రతిభ చూపిన విద్యార్థులను భాష్యం విద్యాసంస్థల డైరెక్టర్ భాష్యం రామకృష్ణ, విశాఖ జిల్లా సిఇఒ ఎం సత్యం, జోనల్ పర్యవేక్షణాధికారి కె వెంకట, భాష్యం సరిపల్లి, రవినగర్ హెచ్ఎంలు కె.రమేష్ కుమార్, రాఘవాచార్యులు అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం యాజమాన్యం

ముత్తంశెట్టికి బి-ఫారం అందజేత

వై.వి.సుబ్బారెడ్డి నుంచి బిఫారం అందుకుంటున్న

ప్రజాశక్తి -భీమునిపట్నం : వైసిపి భీమిలి అసెంబ్లీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు ఆపార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు వైవి.సుబ్బారెడ్డి సోమవారం బిఫాం అందజేశారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ, సిఎం జగన్ ఆశీస్సులు, వైవి సుబ్బారెడ్డి తోడ్పాటుతోబి ఫాం అందుకున్నానని, వచ్చే ఎన్నికల్లో విజయం సాధిస్తానని ధీమావ్యక్తం చేశారు.

త్వరలో ఓటరు స్లిప్పుల పంపిణీ : ఆర్ఒ

ప్రజాశక్తి -భీమునిపట్నం : రెండు, మూడు రోజుల్లో ప్రతి ఓటరుకు ఓటరు స్లిప్పులు అందజేయనున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్థానిక ఆర్‌డి ఎస్ భాస్కర రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, నియోజక వర్గంలో మొత్తం ఓటర్లు 3,61,884 మంది ఉండగా, వీరిలో లక్షా 84,352 మంది మహిళలు, లక్షా 77 వేల 517మంది పురుషులు (49.05 శాతం) ఉన్నట్లు వివరించారు, వీరందరికీ ఇప్పటికే నియమితులైన 359 మంది బిఎల్ఒలు, 30 మంది సెక్టార్ అధికార్లు, 42 మంది రూట్ అధికారులు ఇంటింటికీ వెళ్లిఓటరు స్లిప్పులు అందజేస్తారని తెలిపారు.బహుళ అంతస్తుల్లో ఉన్న వారికి వాచ్‌మెన్లకు ఓటరు స్లిప్పులు ఇవ్వబోమన్నారు. తహసీల్దార్ టి గోవింద్ పాల్గొన్నారు

నేడు 'సిద్ధం' యాత్ర పునఃప్రారంభం

ప్రజాశక్తి -మధురవాడ : సిఎం జగన్ మేమంతా సిద్ధం బస్‌యాత్ర పిఎంపాలెం క్రికెట్ స్టేడియం నుంచి మంగళవారం మళ్లీ ప్రారంభమౌతుందని భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. మధురవాడ మిథిలాపురం వుడాకాలనీలో సిఎం బస వద్ద విలేకర్లతో మాట్లాడుతూ, ఒకరోజు విరామం తర్వాత మంగళవారం ఉదయం 9 గంటలకు రోడ్డు షో ప్రారంభమై, ఆనందపురం మీదుగా సాగుతుందని, పెద్దిపాలెం చెన్నై కన్వెన్షన్ సెంటర్‌లో సోషల్ మీడియాతో ఇంట్రాక్షన్, తర్వాత అక్కడే మధ్యాహ్న భోజనం ఉంటుందన్నారు. అనంతరం యాత్ర విజయనగరం జిల్లాలోకి ప్రవేశిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

కూటమి శ్రేణుల ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి- పెందుర్తి: ఎస్ఆర్ పురం గ్రామం పంచాయతీ పరిధిలోని కేదారువానిపాలెంలో టిడిపి, బిజెపి, జనసేన గ్రామస్థాయి నేతలు, కార్యకర్తలు సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వైసిపి ప్రభుత్వ అరాచకాలు, వైఫల్యాలను వివరిస్తూ, కూటమి గెలిస్తే అమలు చేసే సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దూది వెంకటరమణ, టిడిపి నాయకులు గొల్లవిల్లి గణేష్ జనసేన నాయకులు గోరపల్లి స్వామినాయుడు, యర్రా రమణ, జెట్టి సత్యనారాయణ, సుంకర కోటి, చల్లా ఈశ్వరరావు పాల్గొన్నారు

'ఉత్తర' కాంగ్రెస్ అభ్యర్థిగా రామారావు

లక్కరాజు రామారావు

ప్రజాశక్తి -సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ఇండియా వేదిక బలపరిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా లక్కరాజు రామారావును సోమవారం ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షునిగా, ఎన్ఎస్‌యుఐ పూర్వ నాయకుడిగా, కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం విశాఖ జిల్లా అధ్యక్షునిగా, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర ఉపాధ్యక్షునిగాకాంగ్రెస్ పార్టీలో పలు పదవులను చేపట్టి, అంకితభావంతో పార్టీకి, ప్రజలకు ఆయన చేసిన సేవలను గుర్తించిన అధిష్ఠానం, లక్కరాజుకు ఉత్తర కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిత్వం ఖరారు చేయడంపై పార్టీ నేతలు, అభిమానులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు

ఎల్అండ్‌టి ఎడ్యుటెక్‌తో 'బుల్లయ్య' ఎంఒయు

ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న రెండు సంస్థల ప్రతినిధులు

ప్రజాశక్తి- సీతమ్మధార: ఇంజినీరింగ్ విద్యార్థులకు ఎంప్లాయబిలిటీ స్కిల్లింగ్ ప్రోగ్రామ్ ప్రారంభిస్తున్నామని డాక్టర్ లంకపల్లి బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ దీపక్ చౌదరి తెలిపారు. ఈ మేరకు సోమవారం కళాశాలలో ఎల్అండ్‌టి ఎడ్యుటెక్‌తో అవగాహన ఒప్పందం కుదిరింది. ఒప్పంద పత్రాలపై బుల్లయ్య కాలేజీ ప్రిన్సిపల్ దీపక్ చౌదరి, ఎల్అండ్‌టి ఎడ్యుటెక్ స్టూడెంట్ కనెక్ట్ హెడ్ ఎంఎఫ్.ఫెబిన్ సంతకాలు చేశారు.ఈ సందర్భంగా మీడియాతో ప్రిన్సిపల్ దీపక్ చౌదరి మాట్లాడుతూ ఇంజనీరింగ్ ఫస్ట్, సెకెండియర్ విద్యార్థులకు కాలేజ్ కనెక్ట్ ప్రోగ్రాంతోపాటు, థర్డ్, ఫైనలియర్ విద్యార్థులకు ఎంప్లాయబిలిటీ స్కిల్లింగ్ ప్రోగ్రామ్ ప్రారంభిస్తున్నామని ఆనందం వ్యక్తం చేశారు. ఎల్ అండ్‌టి ఎడ్యుటెక్ కాలేజ్ కనెక్ట్ బిజినెస్ హెడ్ ఫెబిన్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ శాఖలలో అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను అందించి, పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య అంతరాన్ని తగ్గించడమే ఈ ఒప్పందం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎల్అండ్‌టి ఎడ్యుటెక్ రీజనల్ మేనేజర్ మయాంక్ రంజన్, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ జి. మధుకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

డిఎంహెచ్ఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి -ఆనందపురం : మండల కేంద్రంలోని పిహెచ్‌సిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు నూతనంగా నిర్మితమైన ఆరుపడకల వార్డ్ గదిని పరిశీలించారు. రికార్డులను పరిశీలించి, పిహెచ్‌సిలో సేవలపై సమీక్షించారు. ఆసుపత్రి డెలివరీలపై ప్రజల్లో అవగాహన కల్పించి, ప్రతినెలా పది డెలివరీలు జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సుఖప్రసవాలకు ప్రాధాన్యతనివ్వా లన్నారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమావతి, పిహెచ్‌సి డాక్టర్ ఎం.గంగు నాయుడు, సిహెచ్ఒ పి.సాంబమూర్తి, ఎంపి హెచ్ఇఒ నాగభూషణం పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖ, అనకాపల్లి
మంగళవారం
23 ఏప్రిల్ 2024

కలం మాట

ఓటరూ..మేలుకో..!

ఓటును నమ్ముకున్న వాడు
తలెత్తుకు ధైర్యంగా తిరగగలడు
ఓటును అమ్ముకున్న వాడు
బిక్కుబిక్కుమంటూ బిత్తరి అయిపోతాడు
హామీల వరదల్లో జనాలు చీమలై
ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు
ఈ చెవిని విని ఆచెవిని వదిలేయాలని
పెదవి విరుపు గుసగుసలాడుకుంటున్నారు
ఢిల్లీ సంద్రం తెస్తానని ఒకడంటే
గల్లీని ఢిల్లీ చేస్తానని మరొకడు అంటాడు
నీవు దేవుడవని ఒకడు ముచ్చటిస్తే
నీవే దేవదేవుడవని మరొకడు
ఆకాశాన నిన్ను నిలబెట్టి అపహాస్యం చేస్తాడు
నాయినో... ఎన్నికలు
వినడానికే భయమేస్తుంది మేనిఫెస్టోలు
దిశానిర్దేశాలు లేవు
కామాలూ ఫుల్‌స్టాపులు లేవు
కొలతలు లేవు కొలమానాలు లేవు
గృహిణియే మా పాలిట దేవత
రైతులే మా తలరాతలు
సామాన్యుడికి జేజేలు
సమస్త ఓటరు లోకానికి జేజేలు
యిదీ వరస మన నేతల మేనిఫెస్టోలో....
ఓటరు మహాశయా ! ఒక్కసారి ఆలోసించు
ముందు వెనుక ఆలోసించక
మందుకో... పొందుకో.. లేక పచ్చనోటుకో
రాజీపడితే నిన్ను కొనుక్కొని బానిస చేస్తారు
గృహిణికి మాయమాటలు చెప్పి
వంటయింటి బడ్జెట్ మిగులు ఆశజూపి
అప్పుల పాలు చేసి ముంచేస్తారు
అందరూ మోసగాళ్లు కాదు
అందరూ అనర్హులు కాదు
కొందరైనా సామ్యవాదులు
సమాజ శ్రేయోవాంఛిత నేతలు వుంటారు
ఉన్న వాళ్లలో ఉత్తములను ఎన్నుకో...
ఓటు కొన్న వారు కన్నా..
ఓటు విలువ తెలుసుకున్న నేతలుంటే...
ఎన్నుకో... ఎన్నదగిన వాడు అనిపించుకో
కాలం కలసి వచ్చింది ఓటరుకి
ఐదేళ్ల ఓటరు తలరాతను తానే....
పదకొండో తేదీన రాసుకోగలడు
కులము కన్నా సుగుణం మిన్న
ధనం కన్నా దయార్ద్ర హృదయం మిన్న
ఉన్నవాడు మరింత ఉన్నవాడు అవుతాడు
లేనివాడు మరింత లేకి బికారి అవుతాడు
స్వార్థపరుల పాలనలో ఓటరు జింకపిల్ల
పులులు, సింహాలు వెంటాడి వేటాడి
బుజ్జగించి, బుద్ధిచెప్పి కబళిస్తాయి
ఐదేళ్ళు చావూ వుండదు బ్రతుకూ వుండదు
యువతా మేలుకో... నవతా మేలుకో.

మీగడ వీరభద్రస్వామి,
కవి, రచయిత, చోడవరం

పోరాడి రాజులౌతారో...
అమ్ముకుని బానిసలౌతారో...
నిర్ణయం మీ చేతిలోనే ఉంది...
- డాక్టర్ బిఆర్.అంబేద్కర్

ఉత్తరంలో రాజు విస్తృత ప్రచారం

ప్రచారానికి వచ్చిన రాజును ఆశీర్వదిస్తున్న అవ్వ

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 54వ వార్డు పాత ఐటిఐజంక్షన్, గౌతమీ గార్డెన్స్, జ్యోతినగర్, తదితర ప్రాంతాలలో స్థానిక కార్పొరేటర్ చల్లా రజిని ఈశ్వరరావు ఆధ్వర్యంలో వైసిపి ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక ప్రజలు ఆయనకు అడుగడుగునా ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కెకె రాజు మాట్లాడుతూ సీఎం జగన్ సంక్షేమ పాలన, ఉత్తరంలో తాను చేసిన అభివృద్ధి, ప్రజాసేవ చూసి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కె.చిరంజీవి, అమర్ రెడ్డి, భాకి శ్యామ్‌కుమార్ రెడ్డి, జివి రమణి పాల్గొన్నారు.

26వ వార్డులో...

జివిఎంసి26వ వార్డు శివాలయం వద్ద వైసిపి ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వార్డు పరిధిలో డ్రైనేజీలు, సిసిరోడ్లు, కమ్యూనిటీ భవనాలు, స్కూల్స్ అభివృద్ధి చేశానని, ఎమ్మెల్యేగా గెలిస్తే, ప్రజలకు మరింత సేవ చేస్తానంటూ ఎన్నికల ప్రచారం చేశారు.

చైత్రపూర్ణిమ వేడుకల్లో కెకె.రాజు

జివిఎంసి 54వ వార్డు ఊర్వశి జంక్షన్, రవీంద్ర నగర్‌లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పదిరోజులుగా నిర్వహిస్తున్న చైత్రపూర్ణిమ వేడుకల్లో కెకె.రాజు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

హామీలు ఘనం.. ఆచరణ శూన్యం..!



చోడవరం షుగర్ ఫ్యాక్టరీ

అపారమైన మెట్ట భూములు, కష్టించి పనిచేసే మానవ వనరులు, పరిశ్రమలకు అనుకూలమైన చక్కటి వాతావరణం, వ్యాపార పంటలకు అనుకూలమైన ఎర్రమట్టి నేలలు ఇవన్నీ చోడవరం నియోజకవర్గం సొంతం. నియోజకవర్గం 4 మండలాల్లో చోడవరం మినహా మిగిలిన బుచ్చయ్యపేట, రామికమతం, రోలుగుంట మండలాల్లో సాగు నీటి వనరులు లేవు. వర్షాలు పడితే తప్ప పంటలు పండే పరిస్థితి లేదు. దీంతో చేసేందుకు పనులు లేకపోవడం, పాలక పార్టీలు ఇచ్చిన అభివృద్ధి హామీలు నెరవేరకపోవడం వెరసి నియోజకవర్గం వలసలకు ఆలవాలంగా మారింది. బుచ్చయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల్లో ప్రజలు సంవత్సరంలో 9 నెలలపాటు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతోపాటు చెన్నై, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వలసలు వెళుతూనే ఉంటారు.

ప్రజాశక్తి -చోడవరం

- చోడవరం నియోజకవర్గంలో సాగునీటి కరువు
- ఏడాదిలో 9 నెలలు వలసలు పోతున్న జనం
- ప్రభుత్వాల కుట్రతో ఇబ్బందుల్లో సుగర్ ఫ్యాక్టరీ
- ప్రధాన రహదారి అస్తవ్యస్తం
- నెరవేరని పరిశ్రమల ఏర్పాటు హామీ

ఉత్తరాంధ్ర సుజన స్రవంతి ద్వారా నీరు అందిస్తామని ఏళ్ల తరబడి రాజకీయ పార్టీలు ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలాయి. నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి దగ్గర నుండి నేడు జగన్మోహన్ రెడ్డి వరకు మధ్యలో పాలించిన చంద్రబాబునాయుడు సైతం ఇచ్చిన హామీలు శిలాఫలకాలగానే మిగిలిపోవడంతో వేలాది ఎకరాలకు నీటి వనరుల్లేక భూములు ఖాళీగానే కనబడుతున్నాయి. పెద్దేరు రిజర్వాయర్ నుండి కుడి కాలువ ద్వారా కొత్తకోట వద్ద ఉన్న చెరువులోకి నీటిని రప్పించి బుచ్చయ్యపేట మండలానికి నీరు అందివ్వడానికి అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం కాలువలను పనులు చేపట్టింది. అయితే రిజర్వాయర్ నీటి సామర్థ్యం లేకపోవడం, దానిని అభివృద్ధి చేయడానికి నిధులు కేటాయించకపోవడంతో ఆ కాలువల్లోకి నీరు రాని పరిస్థితి ఏర్పడింది. కాలువలు పూడికపోయాయి. ఈ రిజర్వాయర్ అభివృద్ధికి ప్రతి ఏటా బడ్జెట్ ప్రతిపాదనలు అయితే చేస్తున్నారుగాని ఒక్క పైసా కూడా గత టిడిపి, నేటి వైసిపి ప్రభుత్వంలో విడుదల చేయలేదు. ఈ మండలాల్లో మినీ రిజర్వాయర్లు నిర్మించాల్సి ఉండగా, అవన్నీ హామీలకే పరిమితమయ్యాయి.



అధ్వాన్నరోడ్డుతో చోడవరం పట్టణంలో ట్రాఫిక్ ఇక్కట్లు

కష్టాల కడలిలో చోడవరం సుగర్స్

ప్రభుత్వ రంగ చక్కెర పరిశ్రమల్లో అగ్రగామిగా ఉంటూ ఏడాదికి 5లక్షల 50 వేల టన్నులు క్రషింగ్ జరిపిన చోడవరం (గోవాడ) సుగర్ ఫ్యాక్టరీ గడిచిన 2023-24 క్రషింగ్ సీజన్‌లో కేవలం లక్షా 60వేలు టన్నులు మాత్రమే క్రషింగ్ చేయగలిగింది. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ఇవ్వకపోవడంతో గిట్టుబాటు గాని రైతులు చెరుకు పంటకు దూరమయ్యారు. ఈ సీజన్‌కు చెరుకు సరఫరా చేసిన రైతులకు ఇప్పటికీ చెల్లింపులు జరపలేదు. దీంతో ఈ ఏడాది రైతులు సాగును తగ్గించారు. గతంలో 32 వేల ఎకరాల్లో చెరుకు సాగు కాగా, నేడు 10వేల ఎకరాలకు తగ్గింది. ఫలితంగా వచ్చే ఏడాది లక్ష టన్నుల క్రషింగ్‌కు పడిపోయే ప్రమాదం ఉంది. మరో వైపు కేంద్ర ప్రభుత్వం పంచదార అమ్మకాలపై ఆంక్షలు విధించింది. లెవీ ఆంక్షలు కారణంగా ఉత్పత్తి అయిన పంచధార సకాలంలో అమ్మడానికి వీలుకాక, నిల్వలు ఉండిపోవడంతో నాణ్యత తగ్గి, తక్కువ ధరకు పంచదారను అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. దీనికి తోడు ఫ్యాక్టరీ నిర్వహణ ఖర్చులు పెరగడం, అవినీతి చోటుచేసుకోవడంతో పరిశ్రమ నష్టాల ఊబిలోకి నెట్టబడింది.

అయితే ఫ్యాక్టరీని ఆధునికీకరించి, ఇథనాల్, డిస్టలరీ, కో-జనరేషన్ ప్లాంట్ విస్తరణ, మొలాసిస్ ద్వారా తినుబండాల ఉత్పత్తులు వంటి అనుబంధ యూనిట్లు ఏర్పాటు చేస్తే ఫ్యాక్టరీ మంచి లాభాల్లో నడిచే అవకాశం ఉంది. వీటిపై నాటి టిడిపి, నేటి వైసిపి ప్రభుత్వాలు, ఇక్కడి నుండి గెలిచిన ప్రజా ప్రతినిధులు హామీలు ఇవ్వడమే తప్ప నెరవేర్చడం లేదు. ప్రైవేటు వారిని ప్రోత్సహించడం కోసం సహకార రంగాన్ని బిజెపి, టిడిపి, వైసిపి ప్రభుత్వాలు పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నాయి. దీంతో 25 వేల మంది సభ్య రైతులు, 2000 మంది కార్మికులు సుమారుగా దీనిపై ఆధారపడ్డ లక్షమంది జీవన పరిస్థితులు అగమ్యగోచరంగా మారాయి.

నెరవేరని హామీలు

- చోడవరం పంచాయతీని మున్సిపాలిటీగా చేయడం
- వెంకన్నపాలెం పిహెచ్‌సి, విత్తనాభివృద్ధి కేంద్రం ఏర్పాటు
- చోడవరం పెద్దచెరువును పర్యటక కేంద్రంగా రూపుదిద్దడం
- నర్సాపేట వద్ద 33 కెవి సబ్ స్టేషన్ ఏర్పాటు
- కొమరవోలు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం
- చోడవరం పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగు

రోడ్ల పరిస్థితి అధ్వానం

రోలుగుంట మండలం నుండి చోడవరం మండలం గంధవరం వరకు నర్సీపట్నం బిఎన్ రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది. ఈ రోడ్డు విస్తరణ కోసం రూ.113 కోట్లు కేటాయించారు. కాంట్రాక్టర్ పనులు వేగవంతంగా చేయకపోవడంతో చాలా చోట్ల రోడ్డు గుంతలు గుంతలుగా కనిపిస్తుంది. దీంతో అనేకమంది ప్రమాదాల బారిన పడుతూ ఆసుపత్రి పాలవుతున్నారు. ఇటీవల చోడవరం పట్టణంలో ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో స్థానిక వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ రూ.96 లక్షలు సొంత నిధులతో నర్సాపేట బ్రిడ్జి నుండి వెంకన్నపాలెం వరకు తారు రోడ్డు వేయించారు. విజయరామరాజుపేట నుండి చోడవరం వరకు రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది.

2014లో చంద్రబాబు అధికారం చేపట్టిన తర్వాత తుని నుండి వయ్యా నర్సీపట్నం, చోడవరం మీదుగా పెందుర్తి వరకు నాలుగు లైన్ల రహదారి విస్తరణ జరుగుతుందని అనేకమార్లు సర్వేలు చేసి చివరకు కనీసం రోడ్లకు మరమ్మతులు కూడా చేయకుండా వదిలేశారు. అప్పటి ఎంపీ అవంతి శ్రీనివాస్, నాటి రాష్ట్ర మంత్రి అయ్యన్నపాత్రుడు అనేకమార్లు రోడ్డు విస్తరణపై పత్రిక సమావేశాలు నిర్వహించారు తప్ప ఆచరణ రూపం దాల్చలేదు. తదుపరి వచ్చిన వైసిపి ప్రభుత్వం రోడ్లకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో మైనర్ రిపేర్లు చేయక గుంతలుగా తయారై వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీనికి తోడు వడ్డాది, విజయరామరాజుపేటల వద్ద బ్రిడ్జిలు కూలి పోయాయి.

జగతా శ్రీనివాస్, కాంగ్రెస్

కెఎస్ఎన్ఎస్.రాజు, టిడిపి

కరణం ధర్మశ్రీ, వైసిపి

హామీలకే పరిమితమైన పారిశ్రామికాభివృద్ధి

నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధి చేపడతామని 2004లో ఎమ్మెల్యేగా ఎన్నికైన గంటా శ్రీనివాసరావు నుండి ఆ తరువాత రెండు మార్లు ప్రాతినిధ్యం వహించిన కెఎస్ఎన్ఎస్ రాజు, 2019లో అధికారం చేపట్టిన ప్రస్తుత ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ చెబుతూ వచ్చారు. పారిశ్రామికరణ దిశగా వీరంతా అడుగులు వేయలేకపోయారు.

గత పాలకులిద్దరూ మళ్లీ పోటీ

వైసిపి నుండి ప్రస్తుతం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ బరిలో ఉండగా, మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు టిడిపి అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. గతంలో రాజు నుండి రెండు దఫాలు ఎమ్మెల్యేగా పని చేయగా, 2019లో ఎమ్మెల్యేగా ఎన్నికైన ధర్మ శ్రీ మరో మారు పోటీలో ఉన్నారు. ఇండియా వేదిక నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా జగతా శ్రీనివాస్ పోటీ చేస్తున్నారు.

చోడవరంలో ఎన్నికైన ఎమ్మెల్యేలు వీరే..

1952లో	కందర్ప వెంకటరామేశం
1955లో	రెడ్డి జగన్నాథం
1962లో	ఈలకుర్తి సత్యనారాయణ
1967లో	వేచలపు పాలవెల్లి
1978లో	వేచలపు పాలవెల్లి
1978లో	ఏమని సీతారామశాస్త్రి
1983లో	గునూరు ఎర్రినాయుడు
1985లో	గునూరు ఎర్రినాయుడు
1989లో	బలిరెడ్డి సత్యారావు
1994లో	గునూరు ఎర్రినాయుడు
1999లో	బలిరెడ్డి సత్యారావు
2004లో	గంటా శ్రీనివాసరావు
2009లో	కెఎస్ఎన్ఎస్.రాజు
2014లో	కెఎస్ఎన్ఎస్.రాజు
2019లో	కరణం ధర్మశ్రీ

స్వతంత్ర అభ్యర్థులు ఇంటింటా ప్రచారం

పద్మనాభంలో ప్రచారం చేస్తున్న నాగోతి నాగమణి

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి, పొట్నూరు గ్రామాల్లో భీమిలి అసెంబ్లీ నియోజకవర్గంలో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీచేస్తున్న నాగోత నాగమణి సోమవారం ఇంటింటా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని గ్రామాల్లో నాలుగు నెలలుగా పర్యటిస్తూ, ప్రజాసమస్యలను తెలుసుకుంటున్నానన్నారు. స్థానికురాలినైన తనకు ఒక్కఛాన్సిచ్చి, వచ్చే ఎన్నికల్లో ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు.ప్రజాసేవకు, నియోజకవర్గ అభివృద్ధికి తనకొక అవకాశాన్ని ఇవ్వాలని కోరారు.

77వ వార్డులో 'గుంటూరు' ప్రచారం.

పెందుర్తి: పెందుర్తి అసెంబ్లీ ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విశాఖ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుంటూరు వెంకట నరసింహారావు సోమవారం 77వ వార్డులో విస్తృతం ప్రచారం చేశారు.. స్థానిక అప్పికొండ దేవాలయంలో సతీమణి భారతి, ఇతర కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతర నమ్మిదొడ్డి, పాలవలస, పిట్టవానిపాలెం తదితర గ్రామాలలో ఇంటింటా ప్రచారం చేశారు. స్థానిక నాయకులు పైడిరాజు, మహేష్, శంకరరావు, ముత్యాలరావు తదితరులు మద్దతు పలికారు.

పెందుర్తిలో ఇంటింటా ప్రచారంలో గుంటూరు నరసింహారావు

జోరుగా సిపిఎం ఎన్నికల ప్రచారం

పౌరహక్కుల సంఘం నేత శ్రీరామ్మూర్తిని కలిసి ఓటు అభ్యర్థిస్తున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజకవర్గంలో సిపిఎం గెలవడానికి రాజకీయంగా పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని, ఇండియా ఫోరం బలపరిచిన సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం జగ్గునాయుడు అన్నారు. సోమవారం సాయంత్రం తోకాడ సమైక్ అపార్ట్‌మెంట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, గాజువాకలో ఎక్కడ చూసినా, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై వాడివేడి చర్చ జరుగుతోందన్నారు. స్టీల్‌ప్లాంట్ అమ్ముతున్న బిజెపికి ఓట్లు వేయబోమంటూ ఇప్పటికే ఓటర్లు నిర్ణయించుకున్నారని, బిజెపితో ప్రత్యక్షంగా, పరోక్షంగా అంటకాగిన టిడిపి, వైసిపిలను ప్రజలను నమ్మే పరిస్థితి లేదన్నారు. ది అదే పరిస్థితివైర్ అన్నారు. దానికి మద్దతుగా ఉన్న టిడిపి, వైసిపిలను కూడా నమ్మే పరిస్థితి లేదన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, గంగవరం పోర్టు కాలుష్యంపై పోరాడుతున్న సిపిఎమ్‌కు ప్రజలు మద్దతుగా నిలుస్తున్నారన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు ఎం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి తవిటయ్య, ట్రెజరర్ రమణ, ఉపాధ్యక్షులు తౌడన్న, సిరి గ్రీన్‌లే అపార్ట్మెంట్ అసోసియేషన్ నాయకులు నారాయణరావు, అప్పారావు, మహిళా కమిటీ నాయకులు వరలక్ష్మి పాల్గొన్నారు.

67వవార్డులో...

ఇండియా వేదిక బలపరిచిన గాజువాక సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు సోమవారం 67వ వార్డు గణేష్‌నగర్, పెంటయ్య నగర్, హైస్కూల్ రోడ్డు, సాయిరాం నగర్, జోగావానిపాలెం ప్రాంతాల్లో జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో ప్రజాసమస్యలపైనా, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న సిపిఎం అభ్యర్థిగా ఎన్నికల బరిలో తనకు కొడవలి, సుత్తి, నక్షత్రం గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఇంటింటా కరపత్రాలను పంచుతూ, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సిపిఎం, ఇండియా ఫోరం గెలుపు అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఎపి పౌర హక్కుల సంఘం నేత టి శ్రీరామమూర్తిని కలిసి తనకు ఓటు వేయాలని కోరారు. ఏరియా సిపిఎం శాఖ కార్యదర్శి పాలూరి లక్ష్మణస్వామి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారంలో పార్టీ గాజువాక జోన్ కార్యదర్శి ఎం రాంబాబు, నేతలు కె. కిరీటం, కె.సంతోషం, వర్మ, బి శ్రీను ఎ.లోకేష్, బంగారునాయుడు, బి వెంకటరావు పాల్గొన్నారు..

72వ వార్డులో...

జివిఎంసి 72వ వార్డు పాత కర్ణవానిపాలెంలో ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం అభ్యర్థి ఎం.జగ్గునాయుడు విజయాన్ని కాంక్షిస్తూ ఎస్‌వికె.పరశురామ్ ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ పెద్దలు సిరసపల్లి అప్పారావు, గొంతిన దేముడు, మడగల కన్నయ్య, కరణంరెడ్డి రాము, సాలాపు రాము, జనపరెడ్డి మనిబాబు తదితరులను కలిసి మద్దతు కోరారు. ప్రచార కార్యక్రమంలో పెంటకోట వెంకటరావు, ఆర్.దండాసి, ఎన్.చంద్రమౌళి, రత్నారావు సీత పాల్గొన్నారు.

కోలాహలంగా కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్

ర్యాలీగా నామినేషన్‌కు తరలివెళుతున్న కాంగ్రెస్ అభ్యర్థి వర్మ, పక్కనే సిపిఎం నేతలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి అసెంబ్లీ స్థానానికి ఇండియా వేదిక బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి అడ్డాల వెంకటవర్మ రాజు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. వేదిక విశాఖ ఎంపీ అభ్యర్థి సత్యారెడ్డి, ఎపిసిసి ప్రధాన కార్యదర్శి గాదం మహేష్, డిసిసి అధ్యక్షులుగొంప గోవిందరాజు, సిపిఎం జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి తదితరులతో కలిసి ప్రచార రథంపై ప్రజలకు అభివాదం చేస్తూ భారీ ర్యాలీగాభీమిలి మండలం తాళ్ళవలస నుంచి తగరపువలస, భీమిలి, బ్యాంక్ కాలనీ, చిన్న బజారు, మెయిన్ రోడ్డు మీదుగా ప్రభుత్వాసుపత్రి వరకు ర్యాలీగా వెళ్లారు. ర్యాలీలో పెద్దఎత్తున వేదిక పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. కోలాటం, తీన్‌మార్ డ్యాన్సులతో ర్యాలీ ఆద్యంతం ఉత్సాహంగా సాగింది

ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనాలివ్వాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రాము

ప్రజాశక్తి -అచ్యుతాపురం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.300 చొప్పున కూలీ చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము డిమాండ్ చేశారు. మండలంలో ఎం జగన్నాధపురం, ఎర్రవరం, మల్లవరం, ఉప్పవరం, నరేంద్రపురం గ్రామాలలో సోమవారం ఆయన పర్యటించి, మట్టి పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలను ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండుటెండలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు నిలువ నీడ కరువైందన్నారు. ఎండలో పనిచేయడం వలన, నేల గట్టిగా ఉండటం వలన, చేతిలో ఇనప ఆయుధాలతో మట్టిని తవ్వడము వలన చేతులు బొబ్బలు కట్టాయని ఆవేదన చెందారు. ఉపాధి కూలీలు విశ్రాంతి తీసుకోవడానికి నీడ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. దాహార్తిని ఉపశమనానికి మజ్జిగ మంచినీరు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వేసవి కలంలో పనిచేస్తున్న కారణంగా 30శాతం అలవెన్స్ అదనంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి 15 రోజులకి ఒకసారి పని చేసిన కూలి డబ్బులు ఇవ్వాలని, సంవత్సరానికి ప్రతి కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఉపాధి కూలీలు అప్పారావు, గజలక్ష్మి, కన్నతల్లి, శ్రీను, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సిఐటియు నేత రాము

భరత్‌కుమార్‌కు వైసిపి బి.ఫారం

ప్రజాశక్తి-అనకాపల్లి

వైసిపి అనకాపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌కు, ఆ పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి, రాజ్యసభ సభ్యులు వై.వి సుబ్బారెడ్డి చేతుల మీదుగా సోమవారం బి- ఫామ్ అందజేశారు. విజయం సాధించాలని భరత్ కుమార్‌ను సుబ్బారెడ్డి ఆశీర్వదించారు.



వైవి సుబ్బారెడ్డి చేతుల మీదుగా బి.ఫారం అందుకుంటున్న భరత్

వైసిపిని ఓడించండి

ప్రజాశక్తి-అనకాపల్లి : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని ఓడించాలని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు పిలుపునిచ్చారు. మీడియా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనకాపల్లి జిల్లాలో రైతాంగాన్ని నమ్మించి మోసం చేశారన్నారు. 2019 ఎన్నికల్లో జిల్లాలో ఉన్న తాండవ, ఏటికొప్పాక తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీలను ఆధునీకరణ చేస్తామని రైతులను అన్ని విధాల ఆదుకుంటామని ఇచ్చిన హామీని మరిచారని విమర్శించారు. ఎటువంటి పంటలు వేయడానికి ప్రభుత్వ సహకారం లేకపోవడంతో సాగునీరు పంట కాలువల ద్వారా నీరు రావడానికి గత ఐదు సంవత్సరాలుగా జంగిల్ క్లియరెన్స్ చేయలేదని, గ్రోయిన్ మరమ్మతులు కూడా చేపట్టలేదని తెలిపారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. విలేకరుల సమావేశంలో పట్టణ ప్రధాన కార్యదర్శి కొట్టి రామకృష్ణ, నోబెల్ టీచర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డైట్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డులు

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక దాడి ఇన్స్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీ 2022 -2023 విద్య సంవత్సరంలో నాణ్యత, నైపుణ్యతతో కూడిన విద్యను పరిగణలోకి తీసుకొని నైపుణ్యత సంస్థల ద్వారా అందించిన భారత విద్య సమర్థత అవార్డులను సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు తెలియజేసారు. అకాడమిక్, పరిశోధనాత్మక అంశాలతో విద్యను అందించడంలో అపార అనుభవం కల్గిన కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్‌ని గుర్తిస్తూ వారికి జీవిత కాల సాధన అవార్డు (లైఫ్ టైం అచివ్మెంట్ అవార్డు)ను బహూకరించారని సంతోషాన్ని వ్యక్తపరిచారు. విద్యలో శ్రేష్టత కు గుర్తించి డైట్ కళాశాల " ఓవరాల్ ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ " అవార్డును పొందిందని తెలిపారు. ఈ రెండు అవార్డులను ఈనెల 21న ఆంధ్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి వి జి డి .ప్రసాద రెడ్డి, ఎబిసిటిఈ చీఫ్ ఎక్స్‌క్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ బుద్ధ చంద్ర శేఖర్ చేతులమీదుగా అందుకున్నారు. కళాశాల విభాగాధిపతులు కె .సుజాత, గోపాలమ్మ, పూర్ణప్రియ, ఎ వెంకటేశ్వర రావు, ఎ దేవి ప్రసాద్, పవిత్ర, అకాడమిక్ డీన్ పార్వతి, డీన్ అడ్మిన్ ఈశ్వర రావు, అకాడమిక్ కో ఆర్డినేటర్ కృష్ణ నాగ్, అధ్యాపకులు ,సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

కొమ్మోజు రమేష్‌కు అవార్డు

ప్రజాశక్తి -అనకాపల్లి : ఆంధ్ర యూనివర్సిటీలో బ్రెయినోవిజన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్ ఎడ్యుకేషన్ ఎక్సెలెన్స్ అవార్డుల్లో భాగంగా అనకాపల్లికి చెందిన కొమ్మోజు రమేష్‌కు 2022-23 విద్యా సంవత్సరానికి ఆల్ ఇండియా కల్పాచార్య అవార్డు అందజేసింది. ఈ సందర్భంగా విశ్వ గురువుగా ఏఐసీటీఈ చీఫ్ కోఆర్డినేటింగ్ అధికారి డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యా పరిశోధన రంగాల్లో సేవలు అందిస్తున్న వారికి అవార్డులను ప్రదానం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టీవీజీడీ ప్రసాద్ రెడ్డి, ప్రత్యేక అతిథిగా భాస్కర్ గంధవాడి చేతుల మీదుగా అవార్డుని అందజేశారు. ఆల్ ఇండియా లెవెల్ అవార్డు రావడం పట్ల రమేష్‌ను పలువురు అభినందించారు.

పైడితల్లమ్మ గుడి ప్రారంభం

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని సింగన్న దొరపాలెం శివారు రామచంద్రపురం గ్రామంలో సోమవారం పైడితల్లమ్మ అమ్మవారి గుడి ప్రారంభోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. గత మూడు రోజులుగా చేస్తున్న పూజాధికాలు ముగిసాయి. గ్రామస్తులంతా అమ్మవారికి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. మూడు గ్రామాలకు చెందిన మహిళా కోలాటం ప్రదర్శనలు అందరినీ అలరించాయి.

వైసిపి ఎంపీ అభ్యర్థి బూడి నామినేషన్

నామినేషన్ అందజేస్తున్న బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అనకాపల్లి పార్లమెంటు వైసిపి అభ్యర్థిగా సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి పార్లమెంటరీ నియోజకవర్గ ఏడూ అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో వేలాదిమంది ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలపై ర్యాలీగా అనకాపల్లి రింగ్ రోడ్‌లో ఉన్న వైసీపీ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం అక్కడ నుంచి ర్యాలీగా నెహ్రూ చౌక్, మెయిన్ రోడ్, సుంకరమెట్ట జంక్షన్ మీదుగా కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్నారు. అభ్యర్థి బూడి ముత్యాల నాయుడుతో పాటు పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బి వి సత్యవతి, ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ తదితరులు వెళ్లి కలెక్టర్ రవి పట్టన్‌శెట్టికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యూసీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, నూకాంబిక దేవస్థానం చైర్మన్ కొణతాల మురళి కృష్ణ, వైసిపి యువజన విభాగం కార్యదర్శి పలక రవి, జాజుల రమేష్, శ్రీ సత్యనారాయణ సూర్యనారాయణ దేవస్థానం చైర్మన్ కె యం నాయుడు, రత్నకుమారి డాక్టర్ విష్ణుమూర్తి, డాక్టర్ లక్ష్మీనరసింహారావు, ఉగ్గిన అప్పారావు, పలు గ్రామాల ఎంపీటీసీలు సర్పంచులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'ప్రజలకు మంచి పనులు చేస్తాను'

ప్రజాశక్తి-పరవాడ : పెందుర్తి నియోజకవర్గ ప్రజలకు మంచి పనులు చేసి ప్రజలలో నిలుస్తానని పెందుర్తి జనసేన పార్టీ అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు అన్నారు. పరవాడలో సోమవారం యుకోనా హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలలో తను గెలిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తానన్నారు. కార్యక్రమంలో పరవాడ మాజీ జడ్పిటిసి పైలా జగన్నాధరావు, అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, పరవాడ సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, జనసేన నేత బుగిడి రామ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పరదేశమ్మను దర్శించుకున్న కొణతాల

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం మామిడిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ పరదేశమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో సోమవారం జరిగిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ అమ్మవార్ని దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపకులు గొట్టిపాటి రామ్ నాథ్ చౌదరి కొణతాలకు శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మామిడిపాలెం తెలుగుదేశం జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు ఆలయ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక విజయరామరాజు పేటకు చెందిన జనసేన నాయకులు ఆరుగుల అర్జున్ ఆధ్వర్యంలో 15 మంది యువకులు కొణతాల రామకృష్ణ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం వీరికి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ జనసేన కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని పల్లపు ఆనందపురం గ్రామానికి చెందిన పలువురు సోమవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఎలమంచిలి శాసనసభ్యులు యువి రమణ మూర్తి రాజు కండువాలు వేసి వారిని పార్టీలోనికి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా డిసిసిబి మాజీ చైర్మన్ యు సుకుమార్ వర్మ, కర్రి మురళీమోహన్‌రావు, కర్రి పెద్దబ్బాయి, పల్లెల సూర్యప్రకాశరావు, ముత్యాల రాయుడు, మరిసా సన్యాసినాయుడు, గొంతున రమణ, కంఠం రెడ్డి నాగేశ్వరరావు, కర్రి ఈశ్వరరావు, కర్రి సూర్యనారాయణ, ముత్యాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సిపిఐఎంఎల్ లిబరేషన్ అభ్యర్థిగా గణేష్

ప్రజాశక్తి -చోడవరం

చోడవరం నియోజకవర్గం సిపిఐఎంఎల్ లిబరేషన్ ఎమ్మెల్యే అభ్యర్థిగా అసంఘటిత కార్మిక వర్గానికి చెందిన సవరాల గణేష్‌ను ఆ పార్టీ ప్రకటించింది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపంకర్ భట్టాచార్య పంపిన ఎంపిక పత్రాలను సోమవారం పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు పిఎస్. అజయ్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు చెందిన కార్మికుడు సవరాలు గణేష్‌ని గెలిపించాలని కోరారు. కేంద్రంలోని ఫాసిస్టు మోడీ సర్కార్‌కు అటు అధికార పార్టీ వైసిపి, ఇటు ప్రతిపక్ష తెలుగుదేశం, జనసేన కొమ్ముకాస్తున్నాయని, తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను వదిలేసారని విమర్శించారు. ఫాసిస్ట్ మోడీ సర్కార్‌కు మద్దతు ఇస్తున్న పొత్తు, తొత్తు పార్టీలను ఓడించాలని కోరారు. చోడవరం అభ్యర్థి గణేష్ ఈ 24న నామినేషన్ దాఖలు చేస్తారని తెలిపారు.

గణేష్‌కు బి.ఫారం అందిస్తున్న అజయ్‌కుమార్

సమగ్ర వ్యవసాయ విధానంతో లాభసాటిగా సాగు

ప్రజాశక్తి-అనకాపల్లి

రైతులు అందుబాటులో ఉన్న ఆధునిక వ్యవసాయ విధానాలను ఉపయోగించుకొని లాభసాటిగా వ్యవసాయం తీర్చిదిద్దుకోవచ్చని ఆచార్య ఎన్‌జి రంగా విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు ఎల్ ప్రశాంతి పేర్కొన్నారు. ఉత్తర కోస్తా మండల పరిశోధన విస్తరణ సలహా మండలి సమావేశం ఆచార్య ఎన్ .జి .రంగా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో విశాఖపట్నం జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో సోమవారం ప్రారంభించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్తర కోస్తా మండలంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అనకాపల్లితో పాటు నాలుగు వ్యవసాయ పరిశోధనా స్థానాలు, నాలుగు విస్తరణ కేంద్రాలు రైతులకు సేవలను అందిస్తున్నాయని పేర్కొన్నారు. చెరకు, వరి, చోడి నువ్వులు, అపరాలు, గోగు రకాల రూపకంలో వ్యవసాయ విశ్వవిద్యాలయ కృషి చేస్తుందని, వీటితోపాటు రైతుకు సాగు ఖర్చు తగ్గించే విధంగా యాంత్రికరణ, జీవన ఎరువులు జీవ సంబంధ చీడపీడల నివారణపై రైతులకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అనకాపల్లి, అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పి వి కె జగన్నాధరావు ఉత్తర కోస్తా మండలంలో 2023 24 సంవత్సరంలో జరిగిన పరిశోధన, విస్తరణ ప్రగతి వివరించారు. విస్తరణ సంచాలకులు కె ఎస్ ఎస్ నాయక్ మాట్లాడుతూ ఏరువాక కేంద్రము,కృషి విజ్ఞాన కేంద్రాలు వ్యవసాయ సాగు ఖర్చు తగ్గించుకునే దిశలో యాంత్రికరణ డ్రోన్ టెక్నాలజీ, మైక్రో ఇరిగేషన్ అనే అంశాలపై రైతులకు అవగాహన కార్యక్రమాలు ప్రదర్శన క్షేత్రాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ ప్రతినిధి బాలునాయక్, సీఎంఎఫ్ఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ జో కిజకుడన్, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రశాంతి

అట్టహాసంగా నామినేషన్లు దాఖలు

నామినేషన్లు అందజేస్తున్న వైసిపి, టిడిపి, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థులు

కాంగ్రెస్ అభ్యర్థితో నేతలు

ప్రజాశక్తి -నక్కపల్లి:పాయకరావుపేట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత నామినేషన్‌ను సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. నక్కపల్లిలోని క్రిష్ టౌన్ షిప్ లో ఆమె స్వగృహం నుండి ఎమ్మెల్యే అభ్యర్థి అనిత ర్యాలీ సాగింది. అనకాపల్లి పార్లమెంటు కూటమి అభ్యర్థి సీఎం రమేష్, పాయకరావుపేట నియోజకవర్గం జనసేన ఇన్చార్జి గెడ్డం బుజ్జి ,కూటమి శ్రేణులతో ప్రారంభమైన ర్యాలీ జాతీయ రహదారి మీదుగా సాగింది. వేలాదిమంది కూటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులతో సందడి నెలకొంది. అనిత వెంట సీఎం రమేష్, గెడ్డం బుజ్జి, వినోద్ రాజు ఉన్నారు.అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం రమేష్, అనిత మాట్లాడారు. పోలీసులు తమపై పక్షపాత వైఖరి ప్రదర్శించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వైపు ట్రాఫిక్ క్లియరెన్స్ చేపట్టకుండా,వైసీపీ నేతలకు చేపట్టారన్నారు.

నక్కపల్లి:పాయకరావుపేట నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి కంబాల జోగులు ఉత్సాహంగా సోమవారం నామినేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు.నక్కపల్లి లో పార్టీ కార్యాలయం నుండి ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు, మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, చిక్కాల రామారావు, శీరం నరసింహమూర్తి తదితర నాయకులు జాతీయ రహదారి మీదుగా ర్యాలీ చేపట్టారు. వేలాదిమంది నాయకులు, కార్యకర్తలు అభిమానులతో సందడి నెలకొంది. కంబాల జోగులు, డివి సూర్యనారాయణ రాజు, వీసం రామకృష్ణ, చిక్కాల రామారావు, బొలిశెట్టి గోవిందరావు కార్యాలయంలోనికి వెళ్లారు. ఆర్వో గీతాంజలి కు ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు నామినేషన్ పత్రాన్ని అందజేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో జోగులు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేశారన్నారు.

నక్కపల్లి:పాయకరావుపేట నియోజకవర్గం జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా దూలపల్లి నాగేశ్వరరావు నామినేషన్ దాఖలు చేశారు. సోమవారం ఆర్ఓ గీతాంజలికి నామినేషన్ పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆర్వో గీతాంజలి మాట్లాడుతూ వైసీపీ అభ్యర్థి కంబాల జోగులు 3 సెట్, కూటమి అభ్యర్థి వంగలపూడి అనిత 1 సెట్, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి నాగేశ్వరరావు 1 సెట్ సోమవారం నామినేషన్లు దాఖలు చేశారని వెల్లడించారు .

చీడికాడ:మాడుగుల నియోజకవర్గం లో కాంగ్రెస్ వామపక్షాల ప్రతిపాదించిన కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బొడ్డు శ్రీనివాస్ రావు నామినేషన్ వేశారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ జన సందోహంతో మండలం కేంద్రం నుండి బయలుదేరి సిరిజం కండివరం ఎల్బీ పట్నం అప్పలరాజుపురం కే.జేపురం మీదుగా కార్లు ర్యాలీగా మాడుగుల తహసిల్దార్ కార్యాలయంకు వెళ్లారు. రిటర్నింగ్ అధికారి కి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంటరీ అభ్యర్థి వేగి వెంకటేష్ తోపాటు నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు కార్యకర్తలు సిఐటియు నాయకులు రంగలి దేముడు నాయుడు, ఈరట నరసింహమూర్తి, కార్యకర్తలు బొడ్డు మహాలక్ష్మి, నాయుడు రామకృష్ణ, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్ల: వైసిపి, అభ్యర్థి కంబాల జోగులు, ఎన్డీఏ కూటమి ఉమ్మడి అభ్యర్థి వంగలపూడి అనిత సోమవారం నక్కపల్లిలో నామినేషన్ల వేసిన తరుణంలో మండలం నుంచి పెద్ద సంఖ్యలో ఇరుపార్టీ శ్రేణులు భారీగా వాహనాలలో ర్యాలీగా బయలుదేరి వెళ్లాయి. మండుతున్న ఎండలను సైతం లెక్క చేయకుండా ఉత్సాహంగా తరలివెళ్లడంతో ఇరుపార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేశారు.

మాడుగుల : మాడుగుల నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి గా బండారు సత్యనారాయణమూర్తి నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట బిజెపి ఎమ్మెల్సీ మాధవ్, అనకాపల్లి జిల్లా తెలుగుదేశం ఇన్చార్జి బత్తుల తాతయ్య బాబు, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సోదరుడు సీఎం రాజేష్, గవిరెడ్డి రామానాయుడు ఉన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

-నామినేషన్ల ర్యాలీలతో ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు
- చేతులెత్తేసిన పోలీసులు

భారీగా నిలిచిన వాహనాలు

ప్రజాశక్తి- నక్కపల్లి:సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్ పుణ్యమాని ట్రాఫిక్ జామ్ అవ్వడంతో ,గంటల కొద్ది ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. పాయకరావుపేట నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు ,కూటమి అభ్యర్థి వంగలపూడి అనిత సోమవారం నామినేషన్లు వేశారు.నామినేషన్ల కార్యక్రమంలో భాగంగా ఇరువురు అభ్యర్థులు పోటీపడి బల నిరూపణ చేయడంతో ,వైసీపీ నుండి ,కూటమి నుండి వేరువేరుగా వేలాదిమంది నాయకులు, కార్యకర్తలు ,అభిమానులు నక్కపల్లి తరలి రావడంతో ,జాతీయ రహదారి జనసంద్రోహంతో కిక్కిరిసిపోయింది.నక్కపల్లి వైసీపీ కార్యాలయం నుండి పార్టీ శ్రేణులతో వైసీపీ అభ్యర్థి కంబాల జోగులు , క్రిష్ టౌన్ షిప్ నుండి కూటమి అభ్యర్థి వంగలపూడి అనిత ,కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఒక్కసారిగా నామినేషన్ దాఖలు చేయడానికి బయలు దేరడంతో జాతీయ రహదారి కిక్కిరిసి పోయింది. ఆర్ఓ కార్యాలయం ఎదురుగా జాతీయ రహదారి వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన గేటు వద్దకు వైసిపి, కూటమి పార్టీలకు చెందిన వేలాదిమంది జనం ఒక్కసారిగా తరలి రావడంతో తోపులాట చోటుచేసుకుంది. జనం తాకిడిని పోలీసులు నియంత్రించలేక పోయారు. జనానికి తగ్గ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయలేదు. ఉన్న పోలీసులు జనాన్ని అక్కడి నుండి చెదరగొట్టే ప్రయత్నం చేశారు. భారీగా జనం తరలి రావడంతో పోలీసులు చేతులెత్తేసారు. సుమారుగా ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచి పోయాయి.దీంతో వాహనాల్లో ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు.

తనిఖీలు చేపడుతున్న అధికారులు

అటవీశాఖ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్ పురంలో అటవీశాఖ అధికారులు పలువురు కార్పెంటర్ల ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు. జిల్లా అటవీశాఖ అధికారి జగన్నాధసింగ్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించి పలు రకాల కలప గుర్తించారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి సబ్ డిఎఫ్ఒ సునీల్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

వైసిపి నేతల ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:అభివృద్ధి, సంక్షేమం కోసం వైసీపీని గెలిపించాలని నర్సీపట్నం ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ కోరారు. సోమవారం నర్సీపట్నం మున్సిపాలిటీ 17వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ ఈ ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైయస్.జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. మళ్లీ అటువంటి పథకాలు కొనసాగాలంటే జగన్ ను సీఎం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్, వార్డు కౌన్సిలర్ గుడబండి ఆదిలక్ష్మీ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్లు చింతకాయల సన్యాసిపాత్రుడు, గొలుసు నరసింహమూర్తి, సీనియర్ నాయకులు గుడబండి నాగేశ్వరరావు, డాక్టర్ లక్ష్మీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మ పండగపై రాజకీయం తగదు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:మరిడమ్మ పండగను రాజకీయం చేయవద్దని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని పెదబొడ్డేపల్లి, బలిఘట్టంలలో కూడా మరిడమ్మ పండుగ నిర్వహిస్తారని, ఇంతలా రాజకీయాలు చేయరని, ప్రశాంతంగా గ్రామస్తులంతా ఒక్కటై నిర్వహించుకుంటారని తెలిపారు. మరిడి మహాలక్ష్మి అమ్మవారికి సంబంధించిన నగలు సన్యాసిపాత్రుడు నిజాయితీగా దేవాదాయశాఖ అధికారులకు అప్పగించారని, అయ్యన్నపాత్రుడు వద్ద ఉన్న ఆరు లక్షల గురించి అసలు మాట్లాడక పోవడం విచిత్రంగా ఉందన్నారు. అయ్యన్నపాత్రుడు మాత్రం ఓట్ల కోసం రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. పత్రికా సమావేశాలు పెడుతూ, రోజుకు ఒక ఆరోపణ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, జాతర నిర్వహించడం చేతకాకపోతే వదిలేయమని హితవు పలికారు. సన్యాసిపాత్రుడుతో తాము చేయిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు:మండల కేంద్రంలో శారద నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సోమవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రాడ్యుయేషన్ కార్యక్రమం చిన్నపిల్లలను ఉత్తేజ పరుస్తుందని, కొత్త ఆశయాలు, అవకాశాలతో కూడిన భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యాభ్యాసంలో నేర్చుకున్న కొన్ని విషయాలను, ఆటల రూపంలో విద్యార్థులు ప్రదర్శించారు. ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎస్ రాజు, పాఠశాల సిబ్బంది చెండ .మత్స్యరాజు, సీసా దొన్ను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి -అనంతగిరి:అసంపూర్తిగా వదిలి వేసిన రోడ్డు పనులు తక్షణమే పూర్తి చేయాలని ఆయా గ్రామాల గిరిజన ప్రజల చీడివాడలో సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ, మండలంలోని పెద్దకోట పంచాయతీ కొండ శిఖరు గ్రామాలైన చీడివలస మీదుగా పారిపల్లి, బందకొండ వరకు రోడ్డు నిర్మించేందుకు గాను 2017 సంవత్సరంలో మొదట విడతగా 19 లక్షల 40 వేలు, రెండో విడత 27 లక్షలు , మూడో విడతగా తొమ్మిది లక్షలు మొత్తం 55 లక్షల 40 వేలు మట్టి ఫార్మేషన్, రోడ్డు నిర్మించేందుకు నిధులు మంజూరు అయ్యాయన్నారు. సుమారు 6 కిలోమీటర్లు మట్టి రోడ్డు పనులు జరిగాయని, 2021 సంవత్సరంలో రెండు కోట్ల 15 లక్షలతో సిబిఎస్ మెటల్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కాగా పనులు పూర్తి చేయకుండా తూతు మంతంగా చేపట్టి వదిలివేసారని తెలిపారు. సీసీ ర్యాంపులు కల్వర్టులు నిర్మించినట్లు రికార్డులు సృష్టించి సుమారు 1 కోటి 93 లక్షల 41 వేల రూపాయలు నిధులను పక్కదారి పట్టించారని పెద్దకోట ఉప్పా మాజీ సర్పంచ్ కిల్లో నాగేశ్వరరావు, కాదాల ,అనీష్ లు ఆరోపించారు. రోడ్డు పనులు నిలిచి పోవడంతో రోడ్డుకు ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కాదెల, అనూష్ కాదెల కొండబాబు, విజయకుమరి, సోమల వసంత పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న గిరిజనులు

టెన్త్‌లో సత్తాచాటిన విద్యార్థులు

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

టెన్త్ ఫలితాల్లో అనకాపల్లి జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. అధిక మార్కులు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు.

శ్రీ ప్రకాష్ విద్యార్థుల విజయకేతనం

పాయకరావుపేట:పదవ తరగతి పరీక్షా ఫలితాలలో శ్రీ ప్రకాష్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. అడారి తనుశ్రీ 595/600, యల్లపు షణ్ముఖ ప్రియ 592/600, కుక్కా యామిని జ్యోతిక 589/600 మార్కులు సాధించారని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ తెలిపారు. ప్రతి సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను చాటుతున్నారని, నూటికి నూరు శాతం ఉత్తీర్ణతా శాతంతో మెరుగైన ఫలితాలు సాదించారన్నారు. వీరందరూ భవిష్యత్తులో మరెన్నో విజయాలను సాదించాలని తన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. 225 మంది విద్యార్థులలో 135మంది 500 పైగా మార్కులు, 62 మంది విద్యార్థులు 550కి పైగా మార్కులు సాదించారని ఆయన తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కే. నరసింహారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

చీడికాడ:మండలంలో 92 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైనారని మండల విద్యాశాఖ అధికారులు బొంజు బాబు, బివి రమణ తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ, మండలంలో 458 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుగా 422 మంది ఉత్తీర్ణులైనారని తెలిపారు. పాసైన నవారిలో 316 మంది కి ఫస్ట్ క్లాస్, 83 మందికి సెకండ్ క్లాస్, 23 కి మందికి థర్డ్ క్లాస్ వచ్చాయన్నారు.మండలంలో 576 మార్కులను భాను సంపత్, 571 మార్కులను చరనీ, 555 మార్కులను టి హేమలతలు సాధించారన్నారు.మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్లో 38మంది విద్యార్థులు పరీక్షలు హాజరవుగా 36 మంది ఉత్తీర్ణులైనారన్నారు. బొబ్బిలి గౌరీ నాయుడు 532, స్వాతికిరణం 482, జ్యోతి 472 మార్కులు సాధించినట్లు ప్రధానో పాధ్యాయులు మంజు బాబు తెలిపారు.

శ్రీ విజ్ఞాన్ ప్రభంజనం

చోడవరం:పట్టణంలోని శ్రీ విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. తమ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని శ్రీ విజ్ఞాన్ డైరెక్టర్ ఎంఎంకె. రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఈ ఏడాది పరీక్షకు హాజరైన 128విద్యార్థులకు గాను 13 మంది 580కు పైగా మార్కులు (ప్రతి ఇద్దరిలో ఒకరికి 550 మార్కులకు పైగా)సాధించారన్నారు. 128 మంది విద్యార్థులకు గాను 34 మందికి 570కు పైగా మార్కులు, 102 మందికి 500కు పైగా మార్కులు వచ్చాయని తెలిపారు. గణితంలో 26 మందికి నూటికి నూరు మార్కులు వచ్చాయని తెలిపారు. విన్నకోట వైష్ణవి 589మార్కులు, పచ్చెర్ల యువకీర్తన 588, చీకటి రాంబాబు 588, కొట్యాట కవిత, వారణాసి అవినాష్, గీతశ్రీకు 585 మార్కులు వచ్చాయన్నారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులను ప్రన్సిపల్ జ్ఞానేశ్వరి అభినందించారు.

వైష్ణవి

కీర్తన

రాంబాబు

చోడవరం: పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలో ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మంచి మార్కులు సాధించి ఉత్తీర్ణులయ్యారు. మండలంలో 14 ప్రభుత్వ పాఠశాలల్లో 756 మంది విద్యార్థులు పరీక్షలు రాగా, 676 మంది పాసై 89 శాతం ఉత్తీర్ణత సాధించారు. మహాత్మ జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థిని కె.ధనలక్ష్మి 588 మార్కులు, కేసు స్వాతి 585, చోడవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు కె నేహా 579, కే నాగలక్ష్మి 577, లక్ష్మీపురం పాఠశాలకు చెందిన కే వినోద్ 577 మార్కులు సాధించారు.

అక్షయ

ప్రైవేటు పాఠశాలకు సంబంధించి సూర్య మహతి పబ్లిక్ స్కూల్ విద్యార్థిని బి.భవాని 592 మార్కులు, చలపతి స్కూల్ జి అశ్విని 592 మార్కులతో టాపర్స్‌గా నిలిచారు. వివేకానంద మోడల్ స్కూల్ విద్యార్థి వై.అక్షయ 558 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచింది.

కె.కోటపాడు : పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో కె.కోటపాడు వేణు విద్యానికేతన్ విద్యార్థి పొన్నగంటి యామిని 588 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలోనూ, చౌడువాడ జడ్పీ హైస్కూల్ విద్యార్థి పి.లోష్ణవి 570 మార్కులతో ద్వితీయ స్థానం, సూర్య బాసర పాఠశాల విద్యార్థి గుంప కళ్యాణి 562 మార్కులతో తృతీయ స్థానం సాధించినట్లు ఎంఈఓ కె.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని కొరువాడ, ఏ.కోడూరు, పాతవలస, మేడిచర్ల, కె.కోటపాడు, గొండుపాలెం, చౌడువాడ, కెజిబివి, రెండు ప్రైవేటు పాఠశాల నుండి మొత్తం 544మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 496 మంది, 91.2శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడాద్ది కెజిబివి విద్యార్థులు టెన్త్ ఫలితాల్లో సత్తా చాటారు. 39 మంది విద్యార్థులకు 39 మంది పాస్ 100శాతం ఉత్తిరిత సాధించారు. తలారి జయ నవ్య దుర్గ 545, సీత సాయి లక్ష్మి 531, పత్తి పూర్ణ 528, పడాల వసంత 526 మార్కులు సాధించారు. 500కి పైబడిన విద్యార్థులు ఆరుగురు ఉన్నారు. వడ్డాది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 170 మంది ఉత్తీర్ణు సాధించారు. విజయరామరాజుపేట జడ్పీహెచ్ఎస్ స్కూల్లో 53 మంది విద్యార్థులకు 44 మంది ఉత్తీర్ణులయ్యారు. వడ్డాది ఎన్‌టిఎస్ 22 మంది విద్యార్థులకు 21 మంది, పిఎంఎస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఆరుగురికి ఆరుగురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

అనకాపల్లి : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి మొత్తం 112 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 104 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 11 మంది విద్యార్థులు 500 మార్కులు సాధించారు. మొత్తం 92.8 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ తెలిపారు. పాఠశాల టాపరుగా బి మౌనిక, పి వెన్నెల 536 మార్కులు సాధించగా, వి సౌమ్య 531, ఎం రూప 527 మార్కులు సాధించారు.

స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులు 10వ తరగతి ఫలితాలలో అత్యుత్తమైన ప్రతిభ కనబరిచారు. పైల మౌళి 573 మార్కులతో ప్రథమ స్థానంలో, ఇంద్ర ఆకాష్ 572 మార్కులతో రెండో స్థానంలో, వర్ధన్ 555మార్కులతో మూడో స్థానంలో నిలినట్లు ప్రిన్సిపాల్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. 60 మంది పరీక్షలు రాయగా, 20 మంది విద్యార్థులకు 500 మార్కులు దాటి సాధించారు. వారికి బిసి సంక్షేమశాఖ అధికారులు అభినందనలు తెలిపారు.

బుచ్చయ్యపేట : మండలంలోని సీతయ్యపేట జెడ్పి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మండలంలో ప్రథమ స్థానం అల్లు సీరిష్ 569, రెండవ స్థానం ఉప్పిలి సోనియా 565, మూడవ స్థానం గోలజానా చైతన్య 563, నాలుగువ స్థానం దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గంట శ్రీదేవి 562 మార్కులు సాధించారు.

కశింకోట : మండలంలోని తేగాడ కెజిబివి విద్యార్థులు పదవ తరగతిలో 90 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ డి చంద్రకళ తెలిపారు. 40 మంది పరీక్షలు రాయగా 36 మంది ఉత్తీర్ణత సాధించారు. గోళగాని రమ్య 547, డి.అంజలి 532, సౌజన్య ప్రియా 530 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు.

పరవాడ : మండలంలో 13 ప్రభుత్వ పాఠశాలలకు గాను 836 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా, 748 మంది ఉత్తీర్ణత సాధించారు. 89.47 శాతం పాసయ్యారని ఎంఇఒలు ఎం. దివాకరరావు, జి. సాయి శైలజ తెలిపారు. వాడ చీపురపల్లి జెడ్‌పి హైస్కూల్ విద్యార్థి డి. రఘు 588 మార్కులతో మండలంట ప్రథమ స్థానంలోనూ, తానాం ఎపి గురుకుల పాఠశాల విద్యార్థి పి.దివ్య 586 మార్కులతో ద్వితీయ స్థానంలోనూ నిలిచారు.

అచ్యుతాపురం : 10వ తరగతి పరీక్ష ఫలితాలలో భవాని విద్యానికేతన్ విద్యార్థి చీరపు లేఖ్య 591 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు కరస్పాండెంట్ కే సంతోష్ తెలిపారు. అచ్యుతాపురం జెడ్‌పి హైస్కూల్ విద్యార్థి వై సాహితీ శివామి 584, కైట్స్ విద్యా విహార్ల రోహిత్ 583, అచ్యుత ఇంగ్లీష్ మీడియం స్కూల్ జి చాందిని 583 మార్కులు, కైట్స్ విద్యా విహార్లో దీపక్ 582, హరినాథ్ 570, హర్ష 569 మార్కులు సాధించారు. కెజిబివి విద్యార్థి ఎన్ ఝాన్సీ 579, టి.నిఖిత 574 మార్కులు సాధించారు.

దేవరాపల్లి : మండలంలోని ముషిడిపల్లి, కాశీపురం, వేచలం, పెదనందిపల్లి, ఎం.అలమండ, కలిగోట్ల, ఏ.కోత్తపల్లి, జడ్పీ పాఠశాలలు, శతశాతం ఉత్తీర్ణత సాధించాయి. కైరిళీ ఇంగ్లీష్ మీడియం స్కూల్స్‌కు చెందిన రొప్పల మనస్సే 588 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. జారెడ్డి పద్మావతి నాయుడు, పోలవరపు భవదేస్, సంమంగి పెన్నిధి విజయదుర్గ 586 మార్కులు సాధించారు. ప్రభుత్వ పాఠశాల విభాగంలో సిహెచ్ దుర్గా వంశి 568 మార్కులు, ఎల్.శిరీష 566 మార్కులు సాధించారు.

అక్షర సహస్రకు 568 మార్కులు

విశాఖపట్నం : గాజువాక పరిధి కూర్మన్నపాలెం కెకెఆర్ గౌతమ్ పాఠశాల పదో విద్యార్థి రెడ్డి అక్షర సహస్ర టెన్త్ పరీక్షా ఫలితాల్లో 568 మార్కులు సాధించింది.

అక్షర సహస్ర

శ్రీగాయత్రి విద్యార్థుల ప్రతిభ

కశింకోట : పది పరీక్ష ఫలితాలలో మండలంలో తాళ్ళపాలెం శ్రీగాయత్రి పాఠశాల విద్యార్థులు కె.పవన్ 582, జి.పవన్ కళ్యాణ్ 566 మార్కులు సాధించారు. వారిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించినారు.

సెయింట్ జాన్స్ విద్యార్థులు...

టెన్త్ ఫలితాల్లో కశింకోట సెయింట్ జాన్స్ విద్యార్థులు స్నేహతరాయి 577, ఎస్ వెంకట వినయ్ 573, జి.ప్రశాంతి 553 మార్కులు సాధించారు. వీరితో పాటు 500పై బడి మార్కులు పైబడి 22 మంది, 400 పైబడి 38 మంది ఉత్తీర్ణత సాధించారు. వారిని పాఠశాల డైరెక్టర్ నోబుల్ కుమార్, కరస్పాండెంట్ అనురాధ, అధ్యాయపకులు అభినందించారు.

శ్రీ వివేకానంద విద్యార్థులు..

కశింకోట శ్రీవివేకానంద విద్యార్థులు పది ఫలితంలో ప్రతిభ కనుబర్చినట్లు కరస్పాండెంట్ మళ్ళ జగదీష్ తెలిపారు. వై నందిని (592), జి త్రిలేషా (591), వై తేజా (586) మార్కులు సాధించారు. వారికి మళ్ల జగదీష్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు

కోటవురట్ల:మండల వ్యాప్తంగా 90 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ రామారావు తెలిపారు. మండల వ్యాప్తంగా 7పాఠశాలలకు సంబంధించి 481 మందికి గాను 420 మంది ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీ, చాణక్య ప్రైవేటు పాఠశాల శత శాతం ఉత్తీర్ణత సాధించగా, వై.రిషిత జిల్లా పరిషత్ బాలికల పాఠశాల నుండి మండల టాపరుగా 572 మార్కులతో నిలిచింది. జిల్లా పరిషత్ (పాములవాక) కామాక్షి దేవి 567, జిల్లా పరిషత్ (వెంకటాపురం) కే నిహాసిని 567 మార్కులు సాధించారు.

నక్కపల్లి:మండలంలోని పది పరీక్షలు 979 మంది వ రాయగా, 771 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని 78.7 శాతం ఉత్తీర్ణత వచ్చిందని ఎంఈఓ నరేష్ తెలిపారు. మండలంలోని గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పిఎస్‌డి జగదీష్ 581 మార్కులు, సిహెచ్ బాలనంద పార్థు 571, వి ఎస్ ఎస్ సుభాష్ 567 మార్కులు సాధించారు. వేంపాడు హైస్కూల్‌కు చెందిన కే లావణ్య 551, డి యశ్వంత్ మణికంఠ 550, ఎన్ సుమ వర్షిని 549, పి నూకరత్నం 510, పెద బోదుగల్లం హైస్కూల్ విద్యార్థి ఎస్ కే యం డి రఫీ 517, డి ఎల్ పురం హై స్కూల్ కు చెందిన పి. లిశ్రుత 554, దేవవరం హైస్కూల్ కు చెందిన ఓ.దేవి 541 మార్కులు సాధించారు.

నక్కపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 55 శాతం, బాలికల ఉన్నత పాఠశాల 89,రెసిడెన్షియల్ 91, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం 98,గొడిచెర్ల హైస్కూల్ 84,పెద భోధిగల్లం హైస్కూల్ 89,రాజయ్యపేట 63, డిఎల్ పురం 84, చినదొడ్డిగల్లు 82, ఉద్దండపురం 98, దేవవరం 83, వేంపాడు 87, జానకయ్య పేట 70 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ వెల్లడించారు.

కొత్తకోట:రావికమతం మండలంలో సోమవారం విడుదలైన పదో వ తరగతి పరీక్షల్లో బాలికలు తమ సత్తాను చాటారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో చదివిన బాలికలు మొదటి స్థానంలో నిలువగా మూడు నుంచి ఐదు స్థానాలు వరకు బాలికలే నిలిచారు. మండల వ్యాప్తంగా సుమారు 11 ప్రభుత్వ పాఠశాల లతో పాటు మరో రెండు ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులు పదోవ తరగతి పరీక్షల్లో సుమారు 83.06 శాతం ఉత్తీర్ణత సాధించారు. మరుపాక మోడల్ స్కూల్ విద్యార్థులు బి.అమృత 584, వై మోహన్ 575, ఎస్ సత్య స్వరూప 573 మార్కులు సాధించారు.

రావికమతం జెడ్‌పి విద్యార్థి సుజనశ్రీ సత్తా

రావికమతం జెడ్పి పాఠశాలకు చెందిన జి.సుజన శ్రీ 568, కె.బాలశ్రీ 564, జి.సంజన శ్రీ 559 మార్కులతో తమ సత్తా చాటారు. అలాగే ప్రైవేట్ పాఠశాల విభాగంలో కొత్తకోట సెయింట్ మేరీ హై స్కూల్ విద్యార్థులు ఎల్.భవాని 585, జి.మోహన సాయి కుమార్ 572, ఎం.హర్ష శ్రీ 565, రావికమతం సిద్ధార్థ హై స్కూల్ విద్యార్థులు సాయి చరిష్మా 585, జ్ఞానేశ్వర్ 572, స్వాతి దుర్గ 570 మార్కులు సాధించారు. పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందించారు.

సుజనశ్రీ

పలు పాఠశాలల్లో శతశాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి–గొలుగొండ

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో గొలుగొండ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు శతశాతం ఉత్ణీత సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.రామకృష్ణ తెలిపారు. మొత్తం 71 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 69 మంది ప్రథమ శ్రేణిలో, ఇద్దరు ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. అందులో గరిట్ల ఆనంద్ 542 మార్కులు సాధించి స్కూల్ టాపర్ గా నిలిచారని చెప్పారు.

అనకాపల్లిడెస్క్:పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నర్సీపట్నం మండలం వేములపూడి మోడల్‌స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ కేఎస్‌డి.సంధ్య సోమవారం తెలిపారు. మొత్తం 94 మంది విద్యార్థులకు 93 మంది ఉత్తీర్ణత సాధించాన్నారు. 90 మంది మొదటి స్థానంలో నిలిచారన్నారు. మొదటి స్థానం వి.వైశాలిదేవి(587), రెండవ స్థానం కె.లీలావర్షిణి(586), మూడవ స్థానం సీహెచ్.దుర్గానాగమణి(584) మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారని చెప్పారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.

రోలుగుంట

మండలంలో పది పరీక్షలకు 343 మంది హాజరు కాగా 303 మంది ఉత్తీర్ణత సాధించగా 40 మంది ఫెయిల్ అయ్యారని మండల విద్యాశాఖాధికారి జాన్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొవ్వూరు జిల్లా పరిషత్, కేజీబివి పాఠశాలలో శతశాతం పాసయ్యారని, కొమరవోలు 88 శాతం, బిబి.పట్నం 65 శాతం, రోలుగుంట 96 శాతం, జె.నాయుడుపాలెం 80 శాతం, కుసర్లపూడి 94 శాతం, కొంతలం 93 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. మండల వ్యాప్తంగా బుచ్చంపేట పాఠశాల విద్యార్థి కన్నూరు హరీష్ 577 మార్కులు సాధించడంతో ప్రిన్సిపల్ సన్మానించారు.

విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు